


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 158, పేజీలు - 08

శనివారం, అక్టోబర్ 12, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## విద్యార్థులకు దసరా కానుక

**- తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపన**

**- షాద్‌నగర్‌లోని కొందుర్గులో సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన- రాష్ట్రవ్యాప్తంగా 28 పాఠశాలలకు ఫౌండేషన్ స్టోన్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దసరా వేళ తెలంగాణ విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ భారీ కానుకను ఇస్తోంది. గతంలో ప్రకటించినట్టుగానే శుక్రవారం (అక్టోబర్ 11న) తెలంగాణలోని ఆయా నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంకుస్థాన చేసారు ప్రభుత్వ పెద్దలు. మొదటి దశలో భాగంగా 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంఖుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కోందుర్గులో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో విద్యాశాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. విద్యాశాఖ బలోపేతం కోసమే కొత్త నియామకాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆందులో భాగంగానే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లను చేపట్టామని తెలిపారు. మరోవైపు పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రణాళికలు రూపొందించామనన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా స్పోర్ట్స్ గ్రౌండ్ ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. మొత్తంగా 5 వేల కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.(మరోవైపు

2లో..

## ఉచిత విద్యుత్‌పై ట్రంప్ హామీ

**- అరవింద్ కేజ్రీవాల్ రియాక్షన్ వైరల్**

**- ఇంధన, కరెంట్ బిల్లులు తగ్గిస్తామని ట్రంప్ హామీ**

**- ఉచితాలు అమెరికాకు పాకాయంటూ కేజ్రీవాల్ ట్వీట్**

**- సోషల్ మీడియాలో బీజేపీ, ఆప్‌ల మధ్య యుద్ధం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మరో మూడు వారాలే ఉండగా తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే విద్యుత్ ఛార్జీలు సగానికి తగ్గిస్తానంటూ డొనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. ట్రంప్ హామీపై ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఎక్స్ (ట్విట్టర్)లో ఆయన చేసిన పోస్ట్‌ను రీట్వీట్ చేస్తూ బీజేపీపై పరోక్షంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 12 నెలల్లో ఇంధన, కరెంట్ బిల్లులు సగానికి తగ్గిస్తా దేశ విద్యుత్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసేలా చర్యలు తీసుకుంటాం దీంతో ద్రవ్యోల్బణం తగ్గుతుంది ఈ చర్యల వల్ల అమెరికా మరీ ముఖ్యంగా మిచిగాన్‌లో వ్యాపార అవకాశాలు పెరుగుతాయి' అని ట్రంప్ హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను ట్రంప్ ఎక్స్‌లో పోస్ట్ చేయగా ఆప్ అధినేత కేజ్రీవాల్ స్పందించారు. 'విద్యుత్ బిల్లులు సగానికి తగ్గిస్తానని ట్రంప్ వాగ్దానం ఇచ్చారు ఉచిత తాయిలాలు అమెరికా దాకా వెళ్లాయి" అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ఇటీవల ఓ కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఎన్డీయే అధికారంలో ఉన్న 22

2లో..

## ఆ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు బ్యాన్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంచలన నిర్ణయాలతో పాలనతో తనదైన మార్క్ క్రియేట్ చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చి అక్రమార్కుల గుండెల్లో బుల్డోజర్లు దింపుతున్న సర్కార్ ఇప్పుడు మరో సంచలన నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఆక్రమిత గ్రామ పంచాయతీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అన్ని ఆక్రమిత గ్రామ పంచాయతీ లేఅవుట్‌లను నిషేధిత జాబితాలోకి చేర్చింది ఆయా ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రణాళిక లేని వృద్ధిని నిరోధించడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. చాలా గ్రామ పంచాయతీ లేఅవుట్లలో రోడ్లు ఇరుకుంగా ఉండటంతో పాటు సెట్ బ్యాక్‌లు లేకుండా, డ్రైనేజీలు లేకుండా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) అనధికార లేఅవుట్‌ల సర్వే నంబర్‌లను నిషేధిత జాబితా కింద బదిలీ చేయడంతో రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని చాలా మంది

2లో..

## ఇక సహించేది లేదు

**- చంద్రబాబు సీరియస్ వార్నింగ్**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఎవరి పనికి వారు పరిమితం కావాలని తేల్చి చెప్పారు. వాస్తవ పరిస్థితులు తమకు తెలియకుండా ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం అంతా బాగుందనే తప్పుడు సమాచారం ఇచ్చినా సహించనని సీఎం తేల్చేసారు. అత్యుత్సాహం పనికి రాదని స్పష్టం చేసారు. పరిధి దాటి వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు.




### చంద్రబాబు ఆగ్రహం

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కీలక ఆదేశాలు ఇచ్చారు. ఈ మధ్య కాలంలో కొందరు ప్రభుత్వ అధికారుల పని తీరు పైన వస్తున్న విమర్శల పైన చంద్రబాబు స్పందించారు. అధికారులు అత్యుత్సాహంతో తమ పరిధి దాటి రాజకీయ స్టేట్మెంట్లు ఇవ్వకుండా కట్టడి చేయాలని సీఎస్ కు సూచించారు. అధికారులు మీడియా ముందు పరిపాలన సంబంధిత అంశాలు మాత్రమే మాట్లాడాలని, రాజకీయ అంశాలు నాయకులు చూసుకుంటారని వ్యాఖ్యానించారు. విశాఖ ఇసుక వ్యవహారంలో అధికారులు వాస్తవాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం పైన చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసారు.

### సీఎంకు ఫిర్యాదులు

కొద్ది రోజుల క్రితం అనంతపురంలో రాముల వారి రథం తగలబడిన ఘటనలో అక్కడ ఎస్పీ చేసిన ప్రకటన చంద్రబాబుకు ఫిర్యాదులు అందాయి. అదే విధంగా విజయవాడ వరదల సమయం లో కొందరు అధికారులు అత్యుత్సాహం తో చేసిన ప్రకటనలు ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించాయని మంత్రి లోకేష్ ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. తాజా

2లో..

## తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం

**- మైసూర్ నుంచి బిహార్‌లో దర్భంగాకు వెళ్తోన్న రైలు**

**- తిరువల్లూర్ జిల్లా సమీపంలో గూడ్సును ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్**

**- ప్రమాదంలో పట్టాలు తప్పిన నాలుగు ఏసీ కోచ్‌లు**



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడులో శుక్రవారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. తిరువల్లూరు జిల్లాలో గూడ్సు రైలును ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలు భోగీలు పట్టాలు తప్పగా నాలుగు ఏసీ కోచ్‌ల్లో మంటలు చెలరేగాయి. రైలు నెంబరు 12578 మైసూరు-దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ చెన్నై సమీపంలోని కావరాయ్‌పెట్టాయ్ స్టేషన్ వద్ద ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొట్టినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 8.50 గంటలకు చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ దళాలు అక్కడకు

2లో..

## రూ.40000 కోట్లతో "ప్రాజెక్టు-77"

**- విశాఖపట్నానికే ఆ ఛాన్స్**



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** ఏపీ ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి పెట్టుబడులు తరలివస్తున్నాయి. విశాఖలో లులు మాల్, మల్టీప్లెక్స్ ఏర్పాటు చేస్తామని లులు గ్రూప్ ఇప్పటికే ప్రకటించింది. అటు టీసీఎస్ సైతం విశాఖపట్నానికి తరలిరానున్నట్లు ఏపీ ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల వెల్లడించారు. ఇప్పుడు విశాఖను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే విధంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అణుశక్తితో దాడి చేయగలిగే రెండు జలాంతర్గాములను దేశీయంగా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుతో పాటుగా 31 ఆయుధాలతో కూడిన ఎంక్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్‌లను అమెరికా నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

2లో..

## ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి కీలక ముందడుగు

**- ఉత్తర్వులు జారీ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దసరా పండుగ వేళ తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో తీపికబురు వినిపించింది. తెలంగాణలో నిరుపేదలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో మరో కీలక ముందడుగు పడింది. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభిస్తామంటూ మంత్రులు చాలా రోజులుగా చెప్తూ వస్తుండగా ప్రజల్లో ఓ ఉత్కంఠ నెలకొంది. అయితే ఆ ఉత్కంఠకు తెరదించుతూ కీలక నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు అవసరమైన విధివిధానాలను ప్రకటించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమైంది. త్వరలోనే అర్హులను కూడా ఎంపిక చేసి వారికి మంజూరు పత్రాలను ఇవ్వాలని యోచిస్తోంది. అయితే ఈ పథకాన్ని పకడ్బంధీగా అమలు చేసేందుకు గానూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని భావించిన సర్కారు అందుకు సంబంధించిన జీవో జారీ చేసింది. ఈ మేరకు అధికారులకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే ఈ గ్రామ కమిటీలో గ్రామ సర్పంచ్ ఛైర్మన్‌గా ఏడుగురు సభ్యులుండగా కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ఈ ఏడుగురు సభ్యుల్లో మహిళ సంఘాల నుంచి ఇద్దరు ఉండనుండగా ఎస్సీ, బీసీ సభ్యులు ఉండేలా జాగ్రత్త పడాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. ఇక మున్సిపాలిటీ స్థాయిలోని కమిటీల్లో కౌన్సిలర్, కార్పొరేటర్, ఛైర్మన్ ఉంటారు. అయితే ఈ కమిటీలు అర్హులను ఎంపిక చేసే ప్రక్రియలో స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాయి. అయితే శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కమిటీల్లో ఉండే సభ్యుల కోసం

2లో..

## మోదీతో ట్రూడో భేటీ

**- లావోస్‌లో భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు**

**- రెండు రోజుల పర్యటకు వెళ్లిన ప్రధాని మోదీ**

**- వియత్నాంలో కెనడా ప్రధానితో జస్టిన్ ట్రూడఓ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు కోసం లావోస్ పర్యటనకు వెళ్లిన ప్రధాన మంత్రి కెనడా ప్రధాని జస్టిన్ టూడోతో భేటీ అయ్యారు. తదుపరి చేయాల్సిన పనులు ఉన్నాయని మోదీతో ట్రూడో చెప్పినట్టు ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కెనడా మీడియా కథనాలు ప్రచురించింది. అయితే, ఈ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు

2లో..

## జీఎస్టీ స్కాంపై ఈడీ కేసు నమోదు

**- మాజీ సీఎస్ సోమేష్‌కు మరిన్ని చిక్కులు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వెలుగు చూసిన ఐజీఎస్టీ స్కాంలో ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1గా వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, ఏ2గా ఉప కమిషనర్ శివరామ్ ప్రసాద్, ఏ3గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్ బాబు, ఏ4గా ప్లియంటో టెక్నాలజీస్, ఏ 5గా మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ ను సీసీఎస్ పోలీసస్నులు నమోదు చేశారు. ఇందులో అక్రమ నగదు చెలామణి జరిగినట్లుగా తేల్చడంతో ఈడీ కేసు పెట్టింది.

### ప్రభుత్వం మారిన తరవాత వెలుగులోకి వచ్చిన జీఎస్టీ స్కాం

ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కి సంబంధించి రూ.1400 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు సీసీఎస్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించి, పెద్ద ఎత్తున ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ను క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గత ఏడాది చివర్లో నిర్వహించిన ఆడిట్‌లో గుర్తించింది. ఈ కేసులో వస్తువులు సరఫరా చేయకపోయినా బోగస్ ఇన్వాయిస్ లను సృష్టించారని అధికారులు గుర్తించారు. ఇది వందల కోట్ల వ్యవహారం కాదని, మొత్తం స్కామ్ రూ.వేల కోట్లలో

2లో..



# విద్యార్థులకు దసరా కానుక

ఖమ్మం జిల్లా లక్ష్మీపురంలో నిర్మించబోతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భట్టి వివరించారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రజల్లో మత సామరస్యం పెరుగుతుందన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు భోదన అందించేలా సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. మరోవైపు పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలంలో అడవి సోమన్ పల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు మంత్రి శ్రీధర్ బాబు శంఖుస్థాపన చేశారు. యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాల భవనాలకు శ్రీకారం చుట్టినట్టు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య అందించటమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మార్పు తీసుకొస్తున్నామని రైతులకు రుణమాఫీ చేసి చూపించమని మంత్రి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మెగా డీఎస్సీతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేశినట్టు వివరించారు. పదేళ్లపాటు ఆగిపోయిన అభివృద్ధిని మళ్లీ ప్రారంభించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# ఉచిత విద్యుత్‌పై ట్రంప్ హామీ

రాష్ట్రాల్లోనూ ఉచిత విద్యుత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేస్తే త్వరలో జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాను బీజేపీ తరఫున ప్రచారం చేస్తానని సవాల్ విసిరారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా విఫలమయ్యాయని కేజ్రీవాల్ విమర్శించారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలుంటే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి అని దేశంలోని ప్రజలకు బాగానే అర్థమైంది' అని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఆప్ ప్రభుత్వం అందిస్తోన్న ఉచితాలు నిలిపివేస్తుందని ఆయన విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీ ఉచిత కరెంటు పథకాన్ని ఆప్ సర్కారు అమలు చేస్తోంది. ఎన్నికల సమయంలో పలు పార్టీలు ఈ తరహా హామీలు ఇవ్వడంతో గెలుపును ప్రభావితం చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేజ్రీవాల్ ఉచితాలు ప్రకటిస్తున్నారని బీజేపీ పలుమార్లు ఎదురుదాడి చేసింది. అయితే, పేదల సంక్షేమం కోసమే తాను వాటిని అమలు చేస్తున్నానంటూ కేజ్రీవాల్ సమర్థించుకున్న విషయం తెలిసిందే. కాగా, అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్‌ను బీజేపీ అభిమానులు ట్రోల్ చేస్తున్నారు. 'అరవింద్ కేజ్రీవాల్‌కు పాలన, ఉచితాల గురించి ఎంత జ్ఞానం ఉందో స్పష్టంగా ఇది చూపిస్తుంది. ఈ ఉచితాలు ఎలా ఉన్నాయి? అతడు (ట్రంప్) ఇంధన సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం గురించి మాట్లాడుతున్నారు ఉచిత విద్యుత్ గురించి కాదు' అని ఒకరు, తగ్గించడం అంటే ఉచితమా? ఆయన వాగ్దానాలను నెరవేర్చడానికి మోదీ నుంచి మీలాగా డబ్బు డిమాండ్ చేయడు' మరొకరు ఇలా విమర్శలు గుప్పించడం గమనార్హం.

# తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం

చేరుకున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా? అనేది మాత్రం తెలియరాలేదు. ప్రమాదం గురించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో నెల్లూరు-చెన్నై మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలును రద్దుచేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడినట్టు సమాచారం. వారిని చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్టు తెలుస్తోంది. మొత్తం 12 బోగీలు పట్టాలు తప్పినట్టు తెలుస్తోంది. వీటిలో నాలుగు ఏసీ కోచ్‌లు, రెండు అన్-రిజర్వ్‌డ్ కోచ్‌లు ఉన్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద సమాచారం కోసం దక్షిణ రైల్వే చెన్నైలో హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసింది. సిగ్నలింగ్ లోపం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం మైసూర్ దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు సిగ్నల్ లోపం వల్ల మెయిన్ రూట్ నుంచి లూప్ లైన్‌లోకి వెళ్లి ఆగి ఉన్న గూడ్సును ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా కుదుపునకు గురై పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలికి డీఆర్ఎం, ఉన్నతాధికారులు బయలుదేరారు. ముందుజాగ్రత్త చర్యగా అంబులెన్స్‌లను అధికారులు సిద్ధం చేశారు. మంటలు అంటుకున్న బోగీల్లో ఉన్నవారిని సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. కాగా, ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస రైలు ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది ఒడిశాలోని బాలేశ్వర్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో 300 మంది ప్రాణాలు కోల్పోగా వందల మంది గాయపడ్డారు. బాలేశ్వర్ వద్ద మెయిన్ లైన్ నుంచి లూప్‌లైన్‌లోకి వచ్చిన కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ అక్కడ ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొట్టగా ఆ సమయంలో ఆ మార్గంలో వస్తోన్న హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టింది.

# మోదీతో ట్రూడో భేటీ

స్పందిస్తూ భారత-వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై కఠినమైన, ధ్రువీకరించిన చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే కెనడాతో సంబంధాల పునరుద్దరణ జరుగుతుందని స్పష్టం చేశాయి. వియత్నాంలో కెనడా, భారత ప్రధానుల మధ్య జరిగిన భేటీలో ఎటువంటి వాస్తవిక చర్చలు జరగలేదని పేర్కొన్నాయి. 'కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మధ్య జరిగిన భేటీలో వాస్తవిక అంశాలు చర్చకు రాలేదు కెనడా గడ్డపై భారత వ్యతిరేక ఖలిస్థానీ కార్యకలాపాలు జరగడానికి అనుమతించబోరని, కెనడా భూభాగం నుంచి భారతదేశానికి వ్యతిరేకంగా హింస, తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని సమర్థించే వారిపై ఇప్పటివరకు లేని గట్టి చర్యలు తీసుకుంటామని భారత్ ఆశిస్తోంది' అని అన్నాయి.'కెనడాతో సంబంధాలకు భారత్ ప్రాముఖ్యతనిస్తుంది అయితే భారత్‌పై కెనడాలో ద్వేషం, తప్పుడు సమాచారం, మత సామరస్యం, హింసను ప్రోత్సహించడానికి కుట్రలు, భారత వ్యతిరేక కార్యకలాపాలను చురుకుగా కొనసాగించే వారిపై కెనడా ప్రభుత్వం కఠినమైన, ధ్రువీకరించదగిన చర్యలు తీసుకుంటే తప్ప, ఇరు దేశాల మధ్య సంబంధాలను సరిదిద్దలేం' అని స్పష్టం చేశాయి. దీనికి ముందు మోదీతో భేటీ అనంతరం కెనడా ప్రధాని ట్రూడో మాట్లాడుతూ 'భారత్- ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత నరేంద్ర మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చించా. తదుపరి మనం చేయాల్సిన పనులు ఉన్నాయని చెప్పా వివరాల్లోకి వెళ్లను కానీ నేను ఎప్పుడూ చెబుతున్నట్లుగా కెనడా పౌరుల భద్రత, చట్టబద్ధపాలనే మా ప్రభుత్వ బాధ్యతలు. వాటిపైనే దృష్టి సారించా' అని ట్రూడో అన్నట్టు కెనడా మీడియా వెల్లడించింది. కాగా, భారత్-కెనడాల మధ్య ఖలీస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య అగ్గి రాజేసింది. ఈ హత్య వెనుక భారత్ ఏజెంట్ల పాత్ర ఉందనడానికి తమ వద్ద సమాచారం ఉందని సాక్షాత్తు కెనడా పార్లమెంట్‌లోనే ట్రూడో చేసిన ఆరోపణలతో కలకలం రేగింది. ఇది ఇరు దేశాల మధ్య దౌత్య యుద్ధానికి దారితీసింది. భారత సీనియర్ దౌత్యవేత్తను కెనడా బహిష్కరించడంతో న్యూఢిల్లీ తీవ్రంగా స్పందించింది. కెనడాకు చెందిన 40 మంది దౌత్య సిబ్బందిని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. అయితే, మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాట్లాడిన ట్రూడో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంతో తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి కీలక ముందడుగు

పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను సర్కారు ఆదేశించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ముందుకెళ్తోంది. అయితే ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ లాంటి పథకాలను అమలు చేస్తుండగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ లాంటి ప్రతిష్టాత్మకైన పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సర్కార్ కసరత్తు చేస్తోంది. గతం ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయగా చాలా వరకు ఇండ్లు నిర్మాణ దశలోనే ఉండటంతో ఆ పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇచ్చిన వాటిలోనూ పైరవీలు నడిచాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఈసారి మాత్రం ఎలాంటి పైరవీలకు తావు లేకుండా అర్హులైనవారికి మాత్రమే ఇండ్లు అందించాలని ప్రభుత్వం యోచిస్తుంది. అందులో భాగంగానే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయనుంది.

# జీఎస్టీ స్కాంపై ఈడీ కేసు నమోదు

ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి సమగ్ర దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించింది. సోమేశ్‌కుమార్ ఆదేశాలతోనే తాము సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేందుకు అంగీకరించామని నిందితులుగా ఉన్న కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ అంగీకరించినట్లు సీసీఎస్ పోలీసులు గతంలో తెలిపారు. ఈ ఇద్దరు అధికారులతో పాటు సోమేశ్‌కుమార్ 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరిట ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకునేవారని సీసీఎస్ పోలీసులు దర్యాప్తులో తేల్చారు. సోమేష్ సహకారంతో 75 సంస్థలకు సంబంధించిన ఐటీ రిటర్నుల సమాచారం తెలియకుండా చేసేందుకు సాఫ్ట్ వేర్ ను మార్చారు. తద్వారా ఐటీసీ క్లెయిమ్‌లకు వీలు కల్పించి రూ.1400 కోట్ల వరకు ఐటీసీ సొమ్మును అడ్డదారుల్లో క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశంకల్పించారు. ఒక్క తెలంగాణ బేవరెజెస్ కార్పొరేషన్‌కు సంబంధించినదే రూ.1000 కోట్ల వరకు ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు గుర్తించారు. మరో 11 సంస్థలకు సంబంధించి రూ.400 కోట్ల ఐటీసీ సొమ్మును క్లెయిమ్ చేసినట్లు తేలిననట్లగా తెలుస్తోంది. కుంభకోణం మొత్తం సోమేశ్‌కుమార్ కనుసన్నల్లోనే నడిచినట్లు దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. సోమేశ్ కుమార్ తో పాటు మరో ముగ్గురు అధికారులకు సీఐడీ అధికారులు ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు ఈడీ కూడా కేసు నమోదు చేసింది.

# రూ.40000 కోట్లతో "ప్రాజెక్టు-77"

ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. చైనా దూకుడు కళ్లెం వేయడానికి న్యూక్లియర్ పవర్డ్ అటాక్ సబ్ మెరైన్లు ఉండాలని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వీటిని దేశీయంగా తయారు చేయాలని భావిస్తోంది. ఇక ఈ ప్రాజెక్టుకు.. ప్రాజెక్ట్ -77గా నామకరణం చేశారు. రూ.40000 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అయితే సుదీర్ఘకాలంగా దీనికి ఆమోదం లభించలేదు. అయితే ఇటీవల జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఆమోదం లభించింది. ప్రాజెక్ట్ -77లో భాగంగా అణుశక్తితో దాడి చేయగలిగే రెండు జలాంతర్గాములను అభివృద్ధి చేయనున్నారు. నౌకాదళ పరిభాషలో వీటిని ఎస్ఎస్ఎన్ అని పిలుస్తారు. ఇక ఇందులో క్షిపణులు, టార్పెడోలు, ఇతరత్రా ఆయుధాలు కూడా ఉంటాయి. అయితే ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఈ రూ.40000 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం విశాఖపట్నాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఈ జలాంతర్గాములను తయారు చేయనున్నట్లు సమాచారం. అయితే మొదటి జలాంతర్గామిని తయారు చేయడానికే 10 నుంచి 12 ఏళ్లు పడుతుందని అంచనా. రెండు ఎస్ఎస్ఎన్లు 95 శాతం దేశీయంగా తయారుకానున్నట్లు సమాచారం. కొన్ని డిజైన్ కన్సల్టెన్సీ కోసం మాత్రమే విదేశీ సహాయం తీసుకుంటామని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా స్థానికంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఉపయోగం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఇక సహించేది లేదు

మంత్రివర్గ సమావేశానికి ప్రారంభం వేళ ఈ పరిణామం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర మంత్రులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేసారు. దీంతో ముఖ్యమంత్రి వెంటనే సీఎస్ కు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అధికారులు పరిధి దాటి వ్యవహరిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు.

### మద్యం టెండర్ల అంశంలో

మద్యం టెండర్ల అంశంలోనూ చంద్రబాబు సీరియస్ అయ్యారు. టెండర్లలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక చేసారు. మద్యం టెండర్లలో కూటమి నేతల జోక్యం పైన మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. ఆ తరువాత సీఎంఓ స్పందించి నేతలెవరూ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని స్పష్టత ఇచ్చింది. ఆ తరువాత రెండు రోజుల మద్యం దరఖాస్తులకు సమయం పొడిగించారు. నేటతో ఆ సమయం ముగియనుంది.

# ఆ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు బ్యాన్

రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పలువురు సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన వస్తోంది.ఇబ్రహీంపట్నం ఆదిభట్లలోని జీపీ లేఅవుట్‌లో చట్టబద్ధతలను విస్మరించి 250 గజాల స్థలాన్ని కొనుగోలు చేసిన శ్రీనివాస్‌రెడ్డి వంటి మధ్యతరగతి కుటుంబాలకు ఈ సమస్య బాధ కలిగించింది. శ్రీనివాస్ రెడ్డి తన కుమార్తె వివాహంలో భాగంగా ప్లాట్‌ను తన అల్లుడికి బహుమతిగా ఇవ్వాలని భావించాడు. అయితే ప్లాట్‌ని నిషేధిత జాబితాలో చేర్చడం వలన దాన్ని వాళ్ల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకుండా ఆగిపోయింది. ప్లాట్ బహుమతిగా ఇవ్వాలనుకున్నానని కానీ ఇప్పుడు అది భారంగా మారిందని ఏం చేయాలో తెలియడం లేదంటూ బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. చట్టం ప్రకారం, లేఅవుట్‌లను మంజూరు చేసే అధికారం హెచ్ఎండిఏతో పాటు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డిటీసిపి)కి మాత్రమే ఉంది. గ్రామ పంచాయతీలకు కాదు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) ఏర్పాటుకు ముందే ఈ జీపీ లేఅవుట్‌లలో చాలా వరకు అనుమతులు లభించాయి. అయితే చనిపోయిన సర్పంచ్‌లు, సిబ్బంది సంతకాల ఫోర్జరీతో ముందస్తు లేఅవుట్‌లు వేసినట్లు అధికారులు గుర్తించారు. మీకు సంబంధించిన భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయా.. లేవా.? అన్నది ఈ కింది లింకు క్లిక్ చేసి చెక్ చేసుకోండి. సాధారణంగా ప్రభుత్వ భూములు, వివాదాస్పద ఆస్తులు, మతపరమైన ట్రస్ట్ భూములు అనధికార రిజిస్ట్రేషన్లను నిరోధించడానికి 22-ఏ జాబితా కిందకు వస్తాయి. ఇటీవల ఈ జాబితాలోకి జీపీ లేఅవుట్‌లను చేర్చడంతో చాలా మంది భూయజమానులు తమ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నిషేధిత జాబితా నుంచి తమ ఆస్తులను తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. మరి ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాలి.

# బాక్స్ ఆఫ్ బోన్స్.. ఇప్పటికీ మిస్టరీగానే..!

అది 1992 మార్చి 30. అమెరికాలోని వ్యోమింగ్‌లోని థర్మోపోలిస్‌లో నివాసముంటున్న న్యూవెల్ సెషన్స్ ఇంట్లో ఉన్నట్టుండి గందరగోళం మొదలైంది. న్యూవెల్, అతడి స్నేహితులు కలసి.. ఓ పాత ట్రంకు పెట్టె తాళాన్ని పగలగొడుతున్నారు. గత ఆరేళ్లుగా అందులో ఏముందనే వారి కుతూహలం.. ఆ పనికి ఉసిగొల్పింది. తాళం ఊడింది. తలుపు తెరుచుకుంది. పాక్షికంగా కప్పిన ప్లాస్టిక్ కవర్‌ను తీసి చూస్తే.. అందులో ఒక బ్యాగ్.. ఆ బ్యాగ్‌లో ఓ మనిషి అస్థిపంజరం విడి భాగాలు ఉన్నాయి. అంతా షాక్. ఒక్కమాటలో చెప్పాలంటే గజగజా వణికిపోయారు. ఆ షాక్‌లోనే న్యూవెల్ భార్య డైసీ.. 'ఇప్పుడు ఏం చేద్దాం' అంది. 'గొయ్యి తవ్వి పూడ్చిపెట్టడం బెటర్' అన్నారంతా. అది మరింత నేరం కావచ్చని డైసీ హెచ్చరించింది. దాంతో న్యూవెల్.. ఆ ట్రంక్ పెట్టెను అక్కడ వదిలిపోయిన తన స్నేహితుడు గాబీ కోసం పరుగుతీశాడు.గాబీ ఎదురు పడగానే.. ట్రంక్ పెట్టె గురించి ఆరా తీసి.. అతడి హావభావాలను గమనించాలనుకున్నాడు. గాబీ 1986లో న్యూవెల్‌కి ఓ షెడ్‌ని అప్పగించాడు. వెళ్తూ వెళ్తూ కొన్ని వస్తువుల్ని అందులో వదిలేసి వెళ్లాడు. వాటిలో ట్రంకు పెట్టె ఒకటి. వదిలేసిన వస్తువుల్ని తీసుకెళ్లడానికి గాబీ చాలా సార్లు షెడ్‌కు వచ్చాడు కానీ..ఆ ట్రంక్ పెట్టెను తీసుకెళ్లే ప్రయత్నమైతే చెయ్యలేదు. 'ఎందుకు?' అని న్యూవెల్ అడగనూ లేదు. ఇప్పుడు గాబీని కలసిన న్యూవెల్.. 'షెడ్‌లో నువ్వు వదిలిపెట్టిన ట్రంక్ పెట్టె గుర్తుందా?' అని అడిగాడు. 'గుర్తుంది.. కానీ దాన్ని నేనెప్పుడూ తెరవలేదు. కొన్నప్పుడే దాని తాళంచెవి మిస్ అయ్యింది. డమ్మీ కీస్‌తో చాలా సార్లు ట్రై చేశా.. కానీ ఓపెన్ కాలేదు..' అంటూ ఎలాంటి తొణుకూ బెణుకూ లేకుండా సమాధానమిచ్చాడు గాబీ.అందులో మనిషి అస్థిపంజరం ఉందని న్యూవెల్ చెప్పగానే.. 'వేళాకోళాలు వద్దు బ్రదర్' అంటూ పెద్దగా నవ్వాడు గాబీ. తాను తమాషా చేయడం లేదని నమ్మించడానికి న్యూవెల్‌కి చాలా సమయమే పట్టింది. అయితే గాబీ సమాధానాల మీద న్యూవెల్‌కి నమ్మకం కుదరలేదు. వెంటనే న్యూవెల్.. జాన్ లమ్లీ అనే అధికారి సాయాన్ని కోరాడు. అతడి సమక్షంలోనే వివిధ పరీక్షల కోసం అస్థిపంజరం ల్యాబ్‌కి తరలింది. ఎడమ పుర్రెలో, ఎడమ భుజంలో బుల్లెట్స్ ఉన్నట్లు ఎక్స్‌రేలు తేల్చాయి. దాంతో పుర్రె ఆకారాన్ని బట్టి చనిపోయిన వ్యక్తి ఊహచిత్రాలను గీయించి .. విడుదల చేశారు పోలీసులు. దీనిపై పత్రికలు కూడా ప్రత్యేక శ్రద్ధచూపించాయి.లమ్లీ వెంటనే.. గాబీని కలసి, తన స్టైల్‌లో ప్రశ్నించాడు. అప్పుడు కూడా గాబీ తడబడలేదు. 'చాలా సార్లు పెట్టె ఓపెన్ చేయడానికి ప్రయత్నించాను. కానీ కుదర్లేదు. దాన్ని ఎక్కడ కొన్నానో గుర్తులేదు. కానీ.. అది 1973 నాటి పెట్టె' అని బదులిచ్చాడు. దాంతో వెంటనే లమ్లీ.. అస్థిపంజరాన్ని చెయెన్నేలోని వ్యోమింగ్ స్టేట్ క్రైమ్ ల్యాబ్‌కు అప్పగించాడు. అక్కడి ల్యాబ్ అధికారి శాండీ మేస్.. ఆ అస్థిపంజరం ఒక పురుషుడిదని, సుమారు 5.9 పొడవు ఉంటాడని తేల్చాడు. అప్పుడే దర్యాప్తు చేస్తున్న అధికారులకు.. గాబీ మిసిసిపీలో ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త అందింది. దాంతో ఈ హత్యకు గాబీకి కచ్చితంగా సంబంధం ఉందని తేలినా.. గాబీ లేకుండాపోవడంతో ట్రంక్ పెట్టె కేసుకు బ్రేక్ పడినట్టయింది.అప్పట్లో లయోవా వాసి షెల్లీ స్టాట్లర్(16), ఆమె తండ్రి ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 'బహుశా ఆ అస్థిపంజరం మీ తాత జోసెఫ్ ముల్వానీది కావచ్చ'ని స్టాట్లర్ తండ్రి పదేపదే అనుమానించాడు. అయితే అప్పట్లో స్టాట్లర్ పెద్దగా పట్టించుకోలేదు. ఏళ్లు గడిచేకొద్ది.. స్టాట్లర్‌కు తన కుటుంబ చరిత్రపై ఆసక్తి పెరిగింది. ఒకసారి తన అమ్మమ్మ మేరీ అలైస్.. తన భర్త జోసెఫ్ ముల్వానీని తన కొడుకు జాన్ డేవిడ్ మోరిస్ చంపేసి ఉంటాడని బాధపడింది. తన తాత గురించి ఎన్నో ఎంక్వైరీలు చేసిన స్టాట్లర్‌కు 2017 వచ్చేసరికి.. ఆ అస్థిపంజరం తన తాత జోసెఫ్‌దేననే నమ్మకం బలపడింది. వెంటనే తన తల్లి కేథరిన్ డీఎన్‌ఏతో సరిచూడాలని అధికారులకు సిఫారసు చేసింది. అదే ఏడాది అక్టోబర్ 19న కేథరిన్ నుంచి డీఎన్‌ఏ నమూనా తీసుకున్నారు అధికారులు. అనుకున్నట్లే ఆ అస్థిపంజరం జోసెఫ్ ముల్వానీదే కావడంతో జాతీయస్థాయిలో ఈ కేసు మరోసారి వార్తలకు ఎక్కింది. జోసెఫ్ ముల్వానీ ఎవరో కాదు.1941 నాటి ఇల్లినాయిస్ నేషనల్ గార్డ్‌లోని 130వ పదాతిదళంలో సభ్యుడు. 2వ ప్రపంచ యుద్ధం సమయంలో పసిఫిక్ థియేటర్‌కి పోరాటయోధుడిగా వెళ్లాడు. తర్వాత కాలిఫోర్నియాలో రైల్‌రోడ్ వర్కర్ అయ్యాడు. మేరీ అలైస్‌ను వివాహం చేసుకున్నాడు. కేథరిన్, ఓఓ, పాట్రిక్ అనే ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. మరి మోరిస్ ఎవరు? మేరీ అలైస్ మొదటి భర్త కొడుకే జాన్ డేవిడ్ మోరిస్. 1963లో జోసెఫ్ లయోవాలో ఇల్లు కొని, అందులోకి కుటుంబంతో సహా మకాం మార్చాడు. ఉన్నట్టుండి జోసెఫ్ అదృశ్యమయ్యాడు. అప్పుడే 16 ఏళ్ల మోరిస్.. జోసెఫ్‌ను హత్య చేసి పాతిపెట్టి ఉంటాడని, ఆ తర్వాత తవ్వి శరీరభాగాలను పెట్టెలో పెట్టి.. థర్మోపోలిస్ తీసుకుని వెళ్లి ఉంటాడని స్టాట్లర్ కుటుంబం భావించింది.ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. మోరిస్, గాబీ ఒక్కరే కావడం. మోరిస్ ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో చలామణీ అయ్యాడని దర్యాప్తులో తేలింది. దాంతో గాబీ ఆత్మహత్య కూడా ఒక డ్రామా కావచ్చనే అనుమానాలు బలపడ్డాయి. అయితే నిజం బయటపడక మునుపే.. న్యూవెల్(ట్రంక్ పెట్టె ఓపెన్ చేసిన వ్యక్తి) 2003న, 2009లో మేరీ అలైస్(జోసెఫ్ భార్య) కన్నుమూశారు. 2019 మార్చి 29న వ్యోమింగ్‌లోని బల్లార్డ్ ఫ్యునరల్ హోమ్‌లో జోసెఫ్ కుటుంబ సమక్షంలో పూర్తి సైనిక స్మారక లాంఛనాలతో గౌరవప్రదంగా జోసెఫ్ అంత్యక్రియలు జరిగాయి. మొత్తానికీ ఈ కథలో గాబీ అలియాస్ మోరిస్ ఏమయ్యాడు? అసలు స్టెప్ ఫాదర్ అయిన జోసెఫ్‌ను ఎందుకు చంపాడు? అనేది మాత్రం మిస్టరీగానే మిగిలిపోయింది.

# ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

**- కక్కిరేణి హరీష్**



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** ప్రజలంతా అమ్మవారి ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో ఉండాలని హబ్సిగూడ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు కక్కిరేణి హరీష్ అన్నారు. జై మాత ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా శాంతి హెూమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు సుమన్ రావు, రాజశేఖర్, జై మాత ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ముశిగంపల శివకుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ ముదిరాజ్, రాకేష్ యాదవ్, అనిల్ గౌడ్ విజయ్, శ్రవణ్, బొండం సాయి, దీపక్ ,ఈశ్వర్, యశ్వంత్, శ్రీకాంత్ మహేశ్వర రాజ్ ,దుర్గ, అఖిల్, కార్తీక్, శశిధర్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# మన సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం - మాధవి లత



**నాగోల్ (ప్రశ్న న్యూస్)** హిందువులందరం కలిసి మన సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం అని హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ ఇంచార్జీ మాధవి లత అన్నారు. ఈ సందర్భంగా వారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అల్కాపురి శ్రీ విద్యా శక్తి పీఠం లో తొమ్మిదవ రోజు శుక్రవారం మహీశాసురమర్థిని అలంకరణలో అమ్మవారికి జరిగిన సుహాసిని పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు దేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ నారాయణం చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని మూల మంత్రం జపం తో మాదవి లత కు అవాహణ చేసి అమెను అమ్మవారిగా భావించి భక్తులు దీవెనలు తీసుకున్నారు. అనంతరం మాధవి మాట్లాడుతూ... మన కోసం ,మన కోరికల కోసం కాకుండా మన ధర్మం కోసం,మన దేవుడి రక్షణ కోసం ఏడాది లో ఒక్కసారైనా దేవాలయాలకు వెళ్ళాలని సూచించారు.ఎప్పుడైతే దేవుడి యోగ క్షేమాల గురించి మనం ఆలోచిస్తమో దేవుడు మన రక్షణ గురించి ఆలోచిస్తాడని పేర్కొన్నారు. ప్రతి ఒక్క హిందూవు ఆచార కట్టు, బొట్టు నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర మీడియా మాజీ ఇన్చార్జి సుధాకర్ శర్మ, ఆద్యాత్మిక వేత్తలు గాయిత్రి వెంకట భరత్ కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవికి ఎస్ఐ ప్రత్యేక పూజలు



**యాదాద్రి (ప్రశ్న న్యూస్)** నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెంలో దుర్గాదేవి శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. రాక్ స్టార్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన దుర్గాదేవి పూజ కార్యక్రమంలో నారాయణపురం ఎస్ఐ జగన్ పాల్గొన్నారు. మహిషాసుర



మర్ధని అవతారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పదేళ్లుగా నిరాటకంగా దేవి నవరాత్రులు నిర్వహిస్తున్న యూత్ సభ్యలను ఆయన అభినందించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతిగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం ఆయనను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు హాజరయ్యారు.

# శ్రీశైలం దేవస్థానం లో 9 వా రోజు అత్యంత వైభవంగా దసరా మహోత్సవాలు

**సిద్ది దాయాని రూపంలో అమ్మవారి దర్శనం**

**అశ్వవాహనసేవ పై ఆదిదంపతులు భక్తులకు దర్శనం**

**వర్షం కారణంగా గ్రామోత్సవం నిలుపుదల**







**శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)** దసరా మహోత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రాత:కాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీ హోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి.అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి. అదేవిధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీ హోమం జరిపించబడుతాయి. కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీపూజలు జరుగనున్నాయి.కుమారీ పూజ దసరామహోత్సవాలలో భాగంగా ప్రతీరోజు కుమారీ పూజలు నిర్వహించడం జరుగుతోంది.ఈ కుమారిపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం సిద్ధిదాయినీ అలంకారం ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగా శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని సిద్ధిదాయినీస్వరూపంలో అలంకరింపజేయడం జరిగింది. సిద్ధిదాయినీదేవి అమ్మవారు చతుర్భుజాలను కలిగి ఉండి కుడివైపున చక్రము, గద, ఎడమవైపున శంఖము, పద్మాలను ధరించి ఉంటుంది. ఈ దేవిని ఉపాసించడం వల్ల అణిమ, మహిమ, లఘిమ మొదలుగు అష్ట (ఎనిమిది) సిద్ధులను పొందవచ్చునని చెప్పబడింది. సర్వదేవతలు, యక్షులు, గంధర్వులు, ఈ దేవిని సదా సేవిస్తుంటారని పండితులు పేర్కొంటున్నారు. ఈ అమ్మవారిని పూజించడం వల్ల కోరిన కోర్కెలన్నీ నెరవేరుతాయని చెబుతారు. అశ్వవాహనసేవ ఈ ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా ఈ రోజు అశ్వవాహనసే జరిపించబడుతుంది. ఈ వాహనసేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, అశ్వవాహనంపై వేంచేబు చేయించి పూజాదికాలు చేయబడుతాయి.

# పక్కా ప్రణాళికతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలి.

**- జిల్లా కలెక్టర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లను ఆదేశించిన రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు**



మంథని ( ప్రశ్న న్యూస్) రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ వానాకాలం సీజన్ లో పక్కా ప్రణాళికతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లను ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. మంథని మండలం అడవిసోమన్ పల్లిలో రూ.300కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై దిశా నిర్ధేశం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆధ్వర్యంలో 37 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. అలాగే రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీటి వసతి, చలువ పందిర్లు, తగు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అంతేగాకుండా రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్టు, బార్ దాన్, హమాలీ సమస్యలు రాకుండా తగు ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. కల్లాల్లో వరి ధాన్యంలో ఎలాంటి కోతలు లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన సెంటర్ ఇన్చార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లు, ఇతర తాత్కాలిక సిబ్బందిని నియమించుకొని సెంటర్లను నిర్వహిస్తున్నామని, కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బందిని విధుల నుంచి తొలగించి రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. కేంద్రాల నిర్వహణ విషయంలో పూర్తి ముందు చూపుతో వ్యవహరిస్తున్నామని, త్వరితగతిన ధాన్యం డబ్బుల చెల్లింపు జరిగేలా తమ సంఘ సిబ్బందితో పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కేంద్రాలకు అవసరమగు ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, మాశ్చర్ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు,ట్యాబ్స్, టార్పాలిన్లు తదితర పరికరాలను అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు.

# ప్రపంచ మేటి విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు

- రాష్ట్ర ఐటి మంత్రి డి.శ్రీధర్ బాబు
- 4 నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన
- క్రీడలను ప్రోత్సహించేలా విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పన
- డిజిటల్ స్మార్ట్ బోర్డు, కంప్యూటర్ ల్యాబ్ వంటి అత్యాధునిక సౌకర్యాల కల్పన
- వచ్చే ఏడాది దసరా నాటికి నిర్మాణాలు పూర్తి





**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు ప్రపంచ మేటీ విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి మంథని మండలంలో అడవి సోమనపల్లి గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మార్పు తిసుకువస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నామని అన్నారు. గ్యారెంటీ పథకాలలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల సబ్సిడీ సిలిండర్, మరియు ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభిస్తామని అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా, బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్యాబినెట్ సహచరులు ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల క్రింద ప్రభుత్వం మొదటి విడతలో 28 పాఠశాలలను మంజూరు చేసిందని, మానేరు నది ఒడ్డున ఉన్న అడవి సోమనపల్లి గ్రామంలో యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించిన డిఎస్సీ నియామకం అంశాన్ని రికార్డు సమయంలో ప్రజా ప్రభుత్వం పూర్తి చేసి, ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా 11 వేలకు పైగా నూతన టీచర్లను నియమించడం జరిగిందని, ఇదే గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ అనే యువకుడికి ఎస్.జి.టి ఉద్యోగం లభించిందని అన్నారు. గడిచిన 10 ఏళ్ళలో పెండింగ్ ఉన్న టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామని, విద్యాశాఖ మెరుగుపరిచేందుకు కమిషన్ ఏర్పాటు చేశామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో , అన్ని వసతులతో కుల, మత భేదాలు లేకుండా మన విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థను మంజూరు చేస్తుందని, 25 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సి, ఎస్టీ ,బీసి, మైనారిటీ వంటి అన్ని రంగాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదివేలా ఈ విద్యా సంస్థ ఉంటుందని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలో 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన అందుతుందని, విద్యార్థుల సౌకర్యం కొరకు తరగతి గదులలో డిజిటల్ స్మార్ట్ బోర్డ్, కంప్యూటర్ ల్యాబ్ , 5 వేలకు పైగా పుస్తకాలతో కూడుకున్న గ్రంథాలయం మొదలగు అత్యాధునిక సౌకర్యాలతో 25 ఎకరాల విస్తీర్ణంలో విద్యాసంస్థ నిర్మాణం ఉంటుందని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల్లో క్రికెట్ , ఫుట్ బాల్ ,బాస్కెట్ బాల్, టెన్నిస్ మొదలగు క్రీడలు ఆడేందుకు అవసరమైన గ్రౌండ్, ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. వచ్చే సంవత్సరం దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని, అన్ని వర్గాల విద్యార్థులు ఒకేచోట అంతర్జాతీయ స్థాయి విద్య అందుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలలో ,2500 పైగా విద్యార్థుల చదువుకుంటారని, వీరికి 120 మంది టీచర్లను కేటాయించడం జరుగుతుందని అన్నారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా సొంతంగా విద్యుత్తు ఉత్పత్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. 250 నుంచి 300 కోట్లు ఖర్చు చేసి ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. త్వరలో రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కూడా ఇటువంటి ఇంటిగ్రేటెడ్ స్కూల్ లోను మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి గౌడ కులస్తులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి రక్షక కవచ కిట్ పై దాదాపు 9 వేల రూపాయలు ఖర్చు చేసి సబ్సిడీపై పూర్తి ఉచితంగా గౌడ సోదరులకు అందిస్తుందని, చెట్టు పై కల్లు తీసేందుకు వెళ్లినప్పుడు ఈ కిట్ ఉపయోగించడం వల్ల ప్రమాదాలను నియంత్రించవచ్చని, ప్రతి గౌడ సోదరుడు ఈ కిట్ ను వినియోగించాలని అన్నారు. చెట్టు పైకి ఎక్కి కళ్ళు తీసే గౌడ సోదరులను గుర్తించి కాటమయ్య రక్షక కిట్లను ముందుగా పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించి ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలను నిర్మిస్తుందని అన్నారు. మన రాష్ట్ర భవిష్యత్తు పిల్లలని, అటువంటి పిల్లల కోసం సమీకృత విద్యాలయాలు నిర్మించడం సంతోషకరమని అన్నారు. బీ ఆర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికి విద్యా హక్కు కల్పించారని అన్నారు. హైదరాబాద్ లో కాక వెంకట స్వామి విద్యా సంస్థను ఏర్పాటు చేసి సంవత్సరానికి 5 వేల మందిని తక్కువ ధర విద్య అందిస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూలి, పిల్లలకు అవసరమైన వసతులతో కూడిన రెసిడెన్షియల్ విద్యా సంస్థ ఆశించిన స్థాయిలో లేవని గమనించి ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని, ముందస్తుగా 28 నియోజకవర్గాలలో నేడు శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు. మన జిల్లాలో మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని అడవి సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ మంజూరు కావడం జరిగిందని అన్నారు. 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థ నిర్మిస్తున్నామని, భవిష్యత్తు అవసరాల కోసం మరో 5 ఎకరాలు విస్తరించే అవకాశం సైతం ఇక్కడ ఉందని, గ్రామ ప్రజలకు ఇబ్బంది కాకుండా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ కోసం 900 మీటర్ల ప్రత్యేక 4 లైన్ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని అన్నారు. నాణ్యతతో కూడిన భవన నిర్మాణ వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని వస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమ,ఆర్.%డ% బి ఈ.ఈ.భావ్ సింగ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, ఎక్సైజ్ సూపరంటెండెంట్ మహిపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో దసరా మహోత్సవాలు

- శ్రీస్వామి అమ్మవారికి ఏపీ ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు
- సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి





**శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )** నంద్యాల జిల్లా శ్రీశైలంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి దసరా సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరుపున దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, కమిషనర్ సత్యనారాయణ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రి ఆనం నారాయణరెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ఆలయ ఈవో పెద్దిరాజు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలకు దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షణలు నిర్వహించి శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి శాస్త్రోక్తంగా పట్టువస్త్రాలు సమర్పించారు పట్టువస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ ఈవో పెద్దిరాజు మంత్రి ఆనం రామానారాయణ రెడ్డికి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి శ్రీస్వామి అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించి లడ్డు ప్రసాదాలను శ్రీస్వామి అమ్మవార్ల చిత్రపటం అందించగా అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా వేద ఆశీర్వచనలిచ్చి దీవించారు అనంతరం దసరా సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ,శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శ్రీశైలం దేవస్థానం 2025 నూతన క్యాలెండర్ ని ఆవిష్కరించారు

# శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు



మంథని( ప్రశ్న న్యూస్) శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మంథని పట్టణంలో శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో జరిగిన పూర్ణాహుతి కార్యక్రమం, నవ చండీయాగం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీధర్ బాబుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం శ్రీ పోచమ్మ తల్లి మాత ను అలాగే శ్రీ లలితమ్మవారి దేవాలయంలో లలిత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# నిర్లక్ష్యం నీడలో అంగన్వాడీ కేంద్రాలు



**భద్రాద్రి బ్యూరో (ప్రశ్న న్యూస్)** అశ్వరావుపేట నియోజకవర్గ కేంద్రాల నిర్వహణ తీరు చూస్తుంటే అసలు ఇక్కడ పనిచేస్తున్న వారికి ఉద్యోగ భాద్యతల పట్ల ఎంతటి నిబద్దత ఉందో అర్థం అవుతుంది. గత కొద్ది రోజులుగా ఇక్కడి అంగన్వాడీ టీచర్ల పనితీరు చర్చనీయాంశంగా మారింది. ఉదయం 10 గంటల సమయమైనా అంగన్వాడీ కేంద్రాలకు తాళాలతో దర్శనమిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనేక సందేహాలకు తావిస్తున్నాయి. ఇక్కడి అంగన్వాడీ టీచర్ల వ్యవహారం చూస్తే అంగన్వాడీ కేంద్రాలు ప్రజలకోసమా...టీచర్ల జీతలకోసమా....? అంటూ గ్రామస్థులు మండిపడుతున్నారు. అశ్వారావుపేట సెక్టార్ పరిధిలోని పెరయిగూడెం అంగన్వాడీ కేంద్రం పదిగంటలైనా తాళాలు తీయకపోవడంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అశ్వారావుపేట అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ తీరు పట్ల జిల్లా అధికారులకు ఉన్న శ్రద్ద స్పష్టం చేస్తుంది. అంగన్వాడీ కేంద్రంలో టీచర్, ఆయా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉండాలి.. కానీ యూనియన్ నాయకుల, ప్రజాప్రతినిధులతో ఉన్న పరిచయం ద్వారా విధులకు సకాలంలో హాజరు కాకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్న నేపథ్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇవ్వాల్సిన ఆహారలక్ష్మీ కూడా సరిగ్గా పంపిణీ చేయక గ్రామస్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్థులు గర్భిణీలు, వాపోతున్నారు

# సంస్కారాలు



గృహస్థు పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్య సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవయోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు. సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే. గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

# వజ్రాల సీతాకోక చిలుకల బ్యాగు.. విలువెంతో తెలుసా!



రోమ్: సాధారణంగా ఓ హ్యాండ్ బ్యాగు ఖరీదు 500 రూపాయల నుంచి ప్రారంభమై వేలల్లో ఉంటుంది. ఇక కొన్ని ప్రత్యేకమైన బ్రాండ్స్‌కు చెందిన ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగుల విలువ లక్షల్లో ఉంటుంది. కానీ ఇటలీకి చెందిన ఓ బ్యాగుల కంపెని ఇటీవల తయారు చేసిన బ్యాగు విలువ తెలిస్తే అందరూ నోళు వెల్లబెట్టాల్సిందే. అలిగేటర్(మొసలి జాతికి చెందిన) చర్మంతో తయారు చేసిన ఈ చిన్న బ్యాగు విలువ రూ. 53 కోట్లు అంట. దీంతో ప్రస్తుతం ఇది ప్రపంచంలోని అంత్యంత ఖరీదైన బ్యాగు అయ్యింది. అయితే దానికి ఎందుకు అంతా ఖరీదు అని ఆలోచిస్తున్నారు. ఎందుకంటే ఈ బ్యాగును వజ్రాలు, మరకత మాణిక్యాలతో పాటు విలువైన రాళ్లతో అలంకరించారు. దీనిని బోరిని మిలానేసి అనే లగ్జరీ లెదర్ హ్యాండ్ బ్యాగుల కంపెనీ తయారు చేసింది. చూడగానే కళ్లు చెదరిలా తయారు చేసిన ఈ బ్యాగును అలిగేటర్ చర్మంతో తయారు చేసిన ఈ బ్యాగుపై తెల్లరంగు బంగారంతో తయారు చేసిన 11 సీతాకోక చిలుకలను అమర్చారు. ఈ సీతాకోక చిలుకలపై మొత్తం 30 క్యారట్ల వజ్రవైఢూర్యాలు, అరుదైన మరకత మాణిక్యాలను పొదిగారు. అయితే ఈ బ్యాగు తయారు చేసేందుకు దాదాపు 1000 గంటలకు పైగా సమయంలో పట్టిందని ఈ సంస్థ వెల్లడించింది. దీనితోపాటు ఇలాంటివే మరో రెండు బ్యాగులను కూడా ఈ సంస్థ తయారు చేసింది. కాగా ఖరీదైన ఈ హ్యాండ్ బ్యాగులను మహాసముద్రాల కాలుష్యంపై అవగాహన కలిగించేందు కోసమే తయారు చేసినట్లు బోరిని మిలానేసి సంస్థ తెలిపింది. వీటి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును సముద్ర కాలుష్య నివారణకు వినియోగిస్తామని ఈ సంస్థ వెల్లడించింది. అయితే దీనిని ఇంతవరకు ఎవరూ ఖరీదు చేయలేదని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచలోనే అంత్యంత ఖరీదైన ఈ బ్యాగును ఏ సంపన్నులు సొంతం చేసుకుంటారో వేచి చూడాలి.

# పుష్కరతుంగ... భద్రగంగ



జలాన్ని దేవతా రూపంలో తల్లిగా భావించి పూజించడం హిందువుల సంప్రదాయం. నదీస్నానాలు, కోనేటి స్నానాలు, మంగళ స్నానాలు, సముద్ర స్నానాలు... అలాగే తీర్థ యాత్రలు, పుణ్య క్షేత్రాలు దర్శనం... సమస్తం నీటితో ముడిపడి వున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్య ప్రదమని హిందువుల విశ్వాసం. సకల జీవరాశులకు ప్రధానమైన జలస్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు. 'తుంగే పానీ.. గంగే స్నానే' అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం! అసలు తుంగభద్ర నది ఎలా ఏర్పడిందో తెలుసుకుందాం. హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రంలో వేయగా శ్రీ మహావిష్ణువు వరాహావతారమెత్తి తన కోరలతో భూమిని సాగరం నుండి పైకెత్తి సర్వజీవులనూ రక్షించాడు. తుంగ (ఎత్తు) నుండి రావడం వల్ల తుంగానదిగానూ, హిరణ్యాక్షుని సంహరించే సమయంలో వరాహరూపుడైన విష్ణువు కుడి కోర నుండి కారిన లాలాజలం భద్రానదిగానూ ఉద్భవించాయి.పుష్కరాలు జరిగే 12 నదులలో తుంగభద్ర ఒకటి. రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు 2008 లో జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఇవే. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని, ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.ప్రముఖ దేవాలయాలను తాకుతూ వెళుతున్న తుంగభద్ర..కర్ణాటక: శృంగేరి (చిక్మగుళూరు), పంపావతి దేవాలయం(కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి).ఆంధ్రప్రదేశ్: రాఘవేంద్రస్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుండ్రేవుల).తెలంగాణ: సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం. తుంగ, భద్ర నదులు కలసి కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తాయి. ఈ రెండు నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది.

# చేపలో ఎన్ని పోషాకాలున్నాయో.. తెలుసా...?

హైదరాబాద్ : చేపల పులుసే కాదు, చేపల వేపుడు కూడా అద్భుతంగానే ఉంటుంది. అయితే ఏదో ఒక రూపంలో చేపలను వారంలో కనీసం 2 లేదా 3 సార్లు తీసుకుంటే మనకు అనేక అద్భుతమైన లాభాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.వయస్సు మీద పడడం వల్ల ఎవరికైనా సహజంగానే మతిమరుపు వస్తుంటుంది. కొందరికి ఇది తీవ్రతరమై అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అలాంటి సమస్య ఉన్నవారు చేపలను తినడం వల్ల ఆ సమస్య నుంచి బయట పడవచ్చని 2016లో పలువురు అమెరికన్ సైంటిస్టులు చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. చేపలను తినడం వల్ల మెదడు బాగా పనిచేస్తుందట. జ్ఞాపకశక్తి పెరుగుతుందని వారు చెబుతున్నారు.-చేపలను బాగా తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో ఓ అధ్యయన వివరాలను ప్రచురించారు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో ఉండే ట్రై గ్లిజరైడ్లను తగ్గిస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. -చేపలను తరచూ తినడం వల్ల వాటిల్లో ఉండే డోపమైన్, సెరొటోనిన్ అనే హార్మోన్లు డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది. -చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. అలాగే పెద్దపేగు, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పాంక్రియాటిక్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లు రాకుండా ఉంటాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ఓ అధ్యయ వివరాలను ప్రచురించారు.



# ప్రకృతిని పరిరక్షించుకోకపోతే విపత్తులు తప్పవు

- తిండిగింజలు - 2.3 కోట్ల టన్నులు - కూరగాయలు - 2.1 కోట్ల టన్నులు - ఏటా మనం వృథా చేస్తున్న ఉత్పత్తులు (ఆహార శుద్ధీకరణ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం...)

- పండ్లు- 1.2 కోట్ల టన్నులు - ఈ వృథా మొత్తం విలువ - 440 కోట్ల డాలర్లు (రూ. 32,329 కోట్లు) - ఈ ఆహార వృథా ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను కూడా పరిగణనలోకి తీసుకుంటే విలువ: 1,060 కోట్ల డాలర్లు(రూ. 77,885 కోట్లు)

**68 శాతం..** 1970 - 2016 మధ్యకాలంలో తగ్గిపోయిన క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలు, సరిసృపాలు, చేపల సంతతి

**85 శాతం..** మనిషి కోల్పోయిన చిత్తడినేలల విస్తీర్ణం

**21.000** లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ)లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గమనిస్తున్న జంతుజాలాల సంఖ్య

**49 శాతం..** భారత్‌లో కేవలం రెండేళ్లలోనే కాలుష్యం బారిన పడ్డ నదీ ప్రవాహాలు. ఢిల్లీలో యమున, దామన్ లోని దామన్ గంగ, ముంబైలోని మీఠీ, హరియాణాలో గగ్గర్, గంగా నదిలోని పలు ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**1,000** గంగ నదీ పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, ఇతర జల వనరుల ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆనకట్టల సంఖ్య

**3** తాబేళ్ల వినాశనం విషయంలో భారత్ ర్యాంకు. చైనా, వియత్నాంలో మనకంటే ఎక్కువ విధ్వంసం జరుగుతోంది!

**0.03 శాతం..** దేశ భౌగోళిక విస్తీర్ణంలో చిత్తడి నేలలు.

**2,500** మన జీవనదుల్లో మిగిలిన గాంజెటిక్ డాల్ఫిన్ల సంఖ్య!

**గొరిల్లాలు.. బూడిద రంగు చిలకలు** ప్రమాదం అంచుల్లోన ఉన్న జంతుజాలంలో ఇవి రెండు మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.

**భారత్‌లో క్షీణత...** క్షీరదాల సంతతిలో తగ్గుదల 12 శాతం. కప్పల వంటి ఉభయ చరాల్లో 19 శాతం క్షీణత. పక్షుల్లో 3 శాతం తగ్గుదల.

**82 కోట్లు** దేశంలోని 12 నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య ఎదుర్కొంటున్న జనాభా.

హరివిల్లులో ఏడు రంగుల స్థానంలో ఒక రంగు మాత్రమే ఉంటే? భూమ్మీద తెల్లటి పూలు మాత్రమే పూస్తే? పండ్లు అన్నింటి రుచి ఒకేలా ఉంటే? అబ్బే... ఏం బాగుంటుంది అంటున్నారా? నిజమే. అన్నీ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది! వైవిధ్యం అనేది మనసుకు ఆనందం కలిగిస్తుంది! ప్రయోజనాలూ బోలెడు! కానీ.. ఈ విషయం మనిషికి పూర్తిగా అర్థమైనట్లు లేదు. ఎందుకంటే.. మన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందని తెలిసినా... వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ తదితరాల పేరుతో.... అడవులు, నదులు, సరస్సులు, నేలలను నాశనం చేస్తూనే ఉన్నాడు! వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సిద్ధం చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ -2020 చెబుతున్నది ఇదే! కోవిడ్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. కోట్ల కేసులు.. లక్షల్లో మరణాలు... ఆర్థిక వ్యవస్థ ఛిద్రం.. ఉద్యోగాల కోత. ఇలా ఎన్నెన్నో సమస్యలకు ఒక వైరస్ కారణమైందంటే ఆశ్చర్యం అనిపించక మానదు. కానీ.. కోట్ల సంవత్సరాలపాటు జంతువుల్లో నిక్షేపంగా బతికిన ఈ వైరస్‌లు ఈ మధ్య కాలంలో మనిషికి ఎందుకు సంక్రమిస్తున్నాయో.. కారణమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? హెచ్1ఎన్1 కానివ్వండి, చికెన్ గున్యా కానివ్వండి. స్వైన్‌ఫ్లూ కానివ్వండి అన్నీ జంతువుల నుంచి మనిషికి సోకిన వ్యాధులే. ఇప్పుడు కోవిడ్%--%19 కూడా. మనిషి ఎప్పుడైతే అటవీ సంపదను తన స్వార్థం కోసం విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడో అప్పటి నుంచే ఈ సమస్య కూడా పెరగడం మొదలైందని అంటారు నిపుణులు.ప్రకృతిని, జీవజాలాన్ని పరిరక్షించుకోవడం ఇప్పటికైనా నేర్చుకోకపోతే కోవిడ్%--%19 తరహా విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ %--%2020లో స్పష్టం చేసింది. రెండేళ్లకు ఒకసారి విడుదల చేసే లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌ను ఈసారి దాదాపు 125 మంది నిపుణులు కలిసి సిద్ధం చేశారు. 1970 నుంచి 2016 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 21 వేల క్షీరదాలు, పక్షులు, జలచరాలు, సరిసృపాలు సంతతిని పరిశీలిస్తూ సిద్ధం చేసిన ఈ నివేదిక దాదాపు 164 పేజీల నిడివి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పరిశీలించిన వాటిల్లో మూడింట రెండు వంతుల జంతుజాలం క్షీణావస్థలో ఉంది. మొక్కల విషయానికొస్తే... ప్రతి ఐదింటిలో ఒకటి అంతరించిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది ఉష్ణమండల ప్రాంతాల్లోని అడవులనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆరుసెకన్లకు రెండు ఎకరాల చొప్పున నష్టపోయామని నివేదిక తెలిపింది. అడవులు నరికివేసి వ్యవసాయం చేయడం మొదలుకొని నదీజలాల కాలుష్యంతో జలచరాలకు ముప్పు తేవడం వరకూ అన్నింటి ఫలితంగా భూమి ఇప్పుడు అత్యవసర సాయం కోరుతూ ఆక్రందనలు చేస్తోందని వివరించింది. ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోతే ఇంకో పదేళ్లలో సరిచేసుకునేందుకు వీలు కానంత పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించింది. అయితే ఇప్పటికైనా పరిస్థితి మించిపోలేదని, దేశాలన్నీ కలిసికట్టుగా పచ్చ'ధనం' పండిస్తే.. వినియోగం విషయంలో మనల్ని మనం మార్చు కోగలిగితే భూమి మరికొన్ని కాలాలపాటు పచ్చగా ఉండేందుకు అవకాశం లేకపోలేదని చెబుతోంది ఈ నివేదిక.

**ఇవీ కారణాలు** భూ వినియోగంలో మార్పులు. అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతూ ఉండటం, జంతుజాలాల ఆవాస యోగ్య ప్రాంతాలు కుంచించుకుపోవడం జీవవైవిధ్యం తగ్గుదలకు ఒక కారణం. ప్రకృతి వనరుల విచ్చలవిడి వాడకం రెండో కారణం. ఇన్వేసివ్ స్పీషీస్ (ఇతర జీవావరణాల నుంచి వచ్చిన జంతువులు, పక్షులు, మొక్కలు) మూడో కారణం. నాలుగవ, ఐదవ కారణాలుగా కాలుష్యం, వాతావరణ మార్పులను పేర్కొనవచ్చు. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జీవ వైవిధ్యతలో తగ్గుదలకు ప్రధానంగా వాటి ఆవాస ప్రాంత నష్టం కారణం కాగా.. ఇన్వేసివ్ స్పీషీస్, వ్యాధులు, అతి వాడకం ఇతర కారణాలుగా కనిపిస్తున్నాయి. భారత్‌లో నగరీకరణ, వ్యవసాయ కార్యకలాపాలు, కాలుష్యం వంటి కారణాల వల్ల చిత్తడి నేలలు దాదాపు లేకుండా పోయాయని లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ రిపోర్ట్ స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాలు తగ్గడంతో జంతు సమూహాల్లోని సంఖ్య కూడా తగ్గిపోతోందని, ఇది కాస్తా సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతోపాటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది భారత్‌లో అటవీ భూములను ఇతర అవసరాల కోసం మళ్లించాలన్న అభ్యర్థనలు దాదాపు 240 వరకూ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాగా.. సుమారు 99 శాతం ప్రతిపాదనలకు అనుమతి లభించిందని ఈ నివేదిక తెలిపింది.

**సమీకృత విధానంతోనే పరిష్కారం...** వేగంగా తగ్గిపోతున్న జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నా, తద్వారా మానవ మనుగడను మరింత సుస్థిరం చేసుకోవాలన్నా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాల్సిందే. ఆహార ఉత్పత్తిని, వాణిజ్యాన్ని మరింత ప్రకృతి అనుకూలమైన పద్ధతుల్లో చేపట్టడం ఇందులో ఒకటి మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో కనీసం మూడో వంతు వృథాగా చెత్తబుట్టల్లోకి చేరుతుండటం జీవవైవిధ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ వృథా కారణంగా గాల్లోకి చేరుతున్న విషవాయువులు వైమానిక రంగ ఉద్గారాల కంటే ఎక్కువగా ఆరు శాతం వరకూ ఉండటం గమనార్హం. ఆహార రంగం ద్వారా వెలువడుతున్న విషవాయువుల్లో 24 శాతం సరఫరా నష్టాలు, వినియోగదారులు వృథా చేయడమేనని నివేదిక తెలిపింది. ఈ నష్టాలన్నింటినీ తగ్గించుకోగలిగితే జీవవైవిధ్యం పెంపునకు తోడ్పడినట్లే. భారత్ విషయానికి వస్తే.. ఉత్పత్తి అవుతున్న ఆహారంలో వృథా అవుతున్నది దాదాపు 40 శాతం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఈ నష్టాన్ని 10 నుంచి 15 శాతంగా మాత్రమే చెబుతున్నా అంతర్జాతీయ సంస్థలు 40 శాతంగా లెక్కవేస్తున్నాయి. జంతుజాలాన్ని, ప్రకృతిని పరిరక్షించడం జీవవైవిధ్యం కోసం కీలకమైనప్పటికీ కేవలం ఈ చర్యల ద్వారా మాత్రమే పరిస్థితిని పారిశ్రామిక విప్లవం మునుపటి స్థాయికి తీసుకువెళ్లలేమని వీటికి ఇతర అంశాలూ కూడా జోడిస్తేనే మేలు జరుగుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.



# భళా.. బాపట్ల బ్లాక్ రైస్!

బీపీటీ 2841 రకం నల్ల బియ్యం వంగడాన్ని బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఐరన్, జింక్ వంటి సూక్ష్మపోషకాలను పుష్కలంగా కలిగి ఉండటం.. పంట పడిపోకుండా ఉండటం, చీడపీడలను తట్టుకోవటం, ఎకరానికి 30–35 బస్తాల దిగుబడినివ్వటం దీని ప్రత్యేకతలు. రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించగా వరుసగా మూడేళ్లు సత్ఫలితాలు వచ్చాయి. సేంద్రియ/ప్రకృతి సేద్యానికి అనువైన ఈ విశిష్ట వంగడం అధికారిక విడుదలకు సిద్ధమవుతోంది. ఆరోగ్యకరమైన ఆహారం గురించి వినియోగదారుల్లో ఇటీవల అవగాహన పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వలన పోషకాలు కలిగిన ఆహార పదార్థాల వాడకం పెరిగింది.



సేంద్రియ ఆహారోత్పత్తులపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నందున నలుపు, ఎరుపు దేశవాళీ వరి రకాల సాగు, వాడకం క్రమక్రమంగా పెరుగుతోంది. కోతకు ముందు పడిపోవటం, దిగుబడులు తక్కువగా ఉండటం వంటి సమస్యలను తట్టుకునే సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పూర్వరంగంలో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎకరానికి 30–35 బస్తాల దిగుబడినిచ్చే బీపీటీ 2841 బ్లాక్ రైస్ వంగడాన్ని అభివృద్ధి చేయటం విశేషం.

**130–140 రోజుల పంట** యం.టి.యు. 7029, ఐ.ఆర్.జి.సి. 18195, యం.టి.యు. 1081 అనే రకాల సంకరం ద్వారా బీపీటీ 2841 సన్న రకం బ్లాక్ రైస్ వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. డా. బి. కృష్ణవేణి, డా. డి. సందీప్ రాజా, డా. సి.వి. రామారావు, డా. వై. సునీత, డా. కె.ఎ. మృదుల ఈ వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2019–20 ఖరీఫ్ సీజను నుంచి రైతు క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల నిర్వహణకు అనుమతి పొందింది.దీని పంట కాలం 130–140 రోజులు. ఈ రకం దాదాపు 110 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. పడిపోదు. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. మధ్యస్త సన్న రకం. వెయ్యి గింజల బరువు సుమారు 14–14.5 గ్రాములు. పైపొట్టును మాత్రమే తొలగించినప్పుడు (దంపుడు బియ్యం) 76.6% రికవరీనిస్తుంది. పాలీష్ చేస్తే 66% రికవరీనిస్తుంది. దంపుడు బియ్యం తింటే దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పాలీష్ చేస్తే పై పొరలలోని నలుపు రంగులో ఉండే అంథోసైనిన్ తవుడులోకి వెళ్లి పోతుంది.

**ఎకరానికి 35 బస్తాల దిగుబడి** బీపీటీ 2841 రకం నారును 20"15 సె.మీ. దూరంలో నాటుకుంటే హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. అయితే, పిలక చేసే సామర్థ్యం తక్కువ కాబట్టి 15"15 సెం.మీ. దూరంలో నాటుకుంటే (ఎకరానికి 20–25 కిలోల విత్తనం అవసరం) మంచిదని, ఇలా చేస్తే ఎకరానికి 35 బస్తాల (హెక్టారుకు 6.5 టన్నుల) వరకు దిగుబడి సాధించవచ్చని రైతుల అనుభవాల్లో తేలిందని బాపట్ల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, చెప్పారు.

**రోగనిరోధక శక్తే కీలకం** బీపీటీ 2841 సన్న వరి బియ్యం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ బియ్యం పైపొర నలుపు రంగులో ఉంటుంది. బియ్యానికి పై పొరలలోని నలుపు రంగు ఆంథోసైనిన్ అనే పదార్థం వల్ల వస్తుంది. మామూలుగా మనం రోజూ ఆహారంగీ తీసుకునే వరి రకాలతో పోల్చినప్పుడు నలుపు, ఊదా, ఎరుపు రంగు పై పొరగా కలిగినటువంటి వరి రకాలలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి.నలుపు రంగు బియ్యం పై పొరలలో ఉండే దట్టమైన నలుపు రంగునిచ్చే ఆంథోసైనిన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సూపర్ ఫుడ్‌గా పిలవబడే బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలను కలిగి ఉన్నట్లు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బీపీటీ 5204తో పోల్చితే యాంటీ ఆక్సిడెంట్లు బీపీటీ 2841 బ్లాక్ రైస్‌లో 3–4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. పాలీష్ చేయని బీపీటీ 2841 దంపుడు బియ్యంలో వంద గ్రాములకు 90.52 మిల్లీ గ్రాముల ఫినాలిక్ పదార్థాలు, వంద గ్రాములకు 110.52 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు కోత బాపట్లలోని అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రయోగశాల పరీక్షల్లో వెల్లడైంది.5% పాలీష్ చేసిన బీపీటీ 2841 నల్ల బియ్యంలో కూడా వంద గ్రాములకు 90.19 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు తేలింది. అదే విధంగా, పై పొట్టు మాత్రమే తొలగించిన ముడి బియ్యంలో 11.02%, పాలీష్ బియ్యంలో 6.3% మాంసకృత్తులున్నాయి. సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతువులు కూడా బీపీటీ 2841లో ఎక్కువ పరిమాణంలో ఉండటం విశేషం. యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేయటం వలన పలు రకాల కేన్సర్లు, గుండె సంబంధిత సమస్య, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# అన్వి... అన్నీ విశేషాలే!



ఏడాదిలోపు పిల్లలు పాకుతూ, పడుతూ లేస్తూ నడవడానికి ప్రయత్నిస్తూ పసి నవ్వులు నవ్వుతారు. వచ్చీరాని మాటలను పలుకుతూ ముద్దు లొలికిస్తుంటారు. "దాదాపు ఈ వయసువారంతా ఇలానే ఉంటారనుకుంటే మీరు పొరపడినట్లే. ప్రతిభకు వయసుతో సంబంధంలేదు. మాలాంటి చిచ్చర పిడుగులు బరిలో దిగితే అచ్చెరువు చెందాల్సిందే" అంటోంది అన్వి విశేష్ అగర్వాల్. రెండున్నరేళ్ల వయసున్న అన్వి తన పెయింటింగ్స్‌తో ఏకంగా గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. రెండేళ్లకే ఈ రికార్డు సాధిస్తే ఇక పెద్దయ్యాక ఇంకెన్ని అద్భుతాలు చేస్తోందో అని అవాక్కయ్యేలా చేస్తోంది చిన్నారి అన్వి. భువనేశ్వర్‌కు చెందిన అన్వి విశేష్ అగర్వాల్ 72 చిత్రాలను గీసి అతి చిన్నవయసులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. ఎక్కువ సంఖ్యలో పెయింటింగ్స్ వేసిన అతిపిన్న వయస్కురాలుగా నిలిచి లండన్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. రెండున్నరేళ్ల పాప ఇన్ని రికార్డులు సాధించిందంటే చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ ఇది అక్షరాలా నిజం. అన్వి పెయింటింగ్ జర్నీ కేవలం తొమ్మిది నెలల వయసులోనే జరగడం విశేషం. అప్పటినుంచి పెయింటింగ్స్ వేస్తూనే ఉంది."మ్యాగ్నెంట్, పెండులమ్, కలర్స్ ఆన్ వీల్స్, రిఫ్లెక్షన్ ఆర్ట్, హెయిర్ కాంబ్ టెక్చర్, రీ సైక్లింగ్ ఓల్డ్ టాయిస్, హ్యూమన్ స్పైరోగ్రఫీ, దియా స్ప్రే పెయింటింగ్, బబుల్ పెయింటింగ్" వంటి 37 రకాల పెయింటింగ్ టెక్నిక్స్‌ను ఆపోశన పట్టింది. పెయింటింగేగాక పంతొమ్మిది నెలల వయసు నుంచే స్పానిష్ భాషలో మాట్లాడడం ప్రారంభించింది. 42 అక్షర మాల శబ్దాలను స్పష్టంగా పలుకుతూ 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అత్యంత అరుదైన చిన్నారులు మాత్రమే ఇవన్నీ చేయగలుగుతారు.అన్నట్లు అన్వి అందర్నీ అబ్బురపరుస్తోంది.

## సులువులైన చిట్కాలతో
# చాక్లెట్ సమోసా-అంజీర్ హల్వా



కావలసినవి: మైదా పిండి – 1 కప్పు, పంచదార పొడి 5 టేబుల్ స్పూన్లు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, డార్క్ చాక్లెట్ పౌడర్ 1 కప్పు, పిస్తా ముక్కలు 1 టేబుల్ స్పూన్పంచదార పాకం అభిరుచిని బట్టి (అప్పటికప్పుడు కావాల్సినంత పంచదార, నీళ్లు పోసుకుని స్టవ్ మీద పెట్టుకోవాలి), నీళ్లు సరిపడాతయారీ: ముందుగా ఒక బౌల్‌లో మైదాపిండి, నెయ్యి, 4 టేబుల్ స్పూన్ల పంచదార పొడి, నీళ్లు పోసుకుని బాగా కలిపి.. కొద్దికొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతీ ముద్దలా చేసుకుని ఓ పావు గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.ఈ సమయంలో ఒక బౌల్ తీసుకుని అందులో చాక్లెట్ పౌడర్, పంచదార పౌడర్, పిస్తా ముక్కలు వేసుకుని అటు ఇటుగా కలిపి.. పక్కన పెట్టుకోవాలి. పావు గంట తర్వాత ఫ్రిజ్‌లోంచి మైదా ముద్దను తీసి.. చిన్న చిన్న పూరీల్లా చేసుకుని.. ప్రతి పూరీలో కొంత చాక్లెట్ మిశ్రమం పెట్టుకుని సమోసాలా చుట్టుకోవాలి. అనంతరం రెండు స్టవ్‌లు ఆన్ చేసుకుని.. ఒకవైపు నూనె కళాయి, మరోవైపు పంచదార పాకం ఉన్న కళాయి పెట్టుకుని సమోసాలను నూనెలో దోరగా వేయించి.. వెంటనే పాకంలో వేసి తీసుకోవాలి. ఒకవేళ పాకంలో వేసుకోవడం ఇష్టం లేకుంటే చాక్లెట్ సాస్‌ని పైన గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.



**అంజీర్ హల్వా** కావలసినవి: డ్రై అంజీర్ 400 గ్రా.(నానబెట్టి, ముక్కలు చేసుకోవాలి) బియ్యప్పిండి/మొక్కజొన్న పిండి 5 టేబుల్ స్పూన్లు(5 టేబుల్ స్పూన్ల నీళ్లనూ జతచేసి బాగా కలుపుకోవాలి), నెయ్యి 9 టేబుల్ స్పూన్లు లేదా అంతకు మించి, పచ్చిపాలు అర కప్పు, పంచదార అభిరుచిని బట్టి, ఫుడ్ కలర్ కొద్దిగా (గ్రీన్ కలర్), యాలకుల పొడి కొద్దిగా, డ్రై ఫ్రూట్స్ ముక్కలు కొద్దిగా తయారీ: ముందుగా పాన్ లో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకుని, వేడి కాగానే.. అందులో బియ్యప్పిండి /మొక్కజొన్నపిండి మిశ్రమం వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు పోసుకుని చిన్న మంటపైన గరిటెతో తిప్పుతూ మరిగించుకోవాలి. తర్వాత ఒక కప్పు పంచదార వేసుకుని కరిగే వరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. అందులో అంజీర్ ముక్కలు, ఫుడ్ కలర్ వేసుకుని మధ్య మధ్యలో కొద్దికొద్దిగా నెయ్యి వేసుకుంటూ తిప్పుతూ ఉండాలి. దగ్గర పడిన తర్వాత ఒకసారి తీపి సరిపోయిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొద్దిగా పంచదార వేసుకుని, మిగిలిన నెయ్యి కూడా వేసుకుని గరిటెతో కలుపుతూ దగ్గర పడే సమయంలో యాలకుల పొడి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అభిరుచిని బట్టి నచ్చిన డ్రై ఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకోవచ్చు లేదా.. నచ్చిన ఫ్లేవర్ ఐస్ క్రీమ్‌తో కలిసి తింటే భలే రుచిగా ఉంటుంది ఈ హల్వా.

# పీయూష్, ఆమ్‌కా పన్నా, జల్‌జీరాతో కడుపు చల్లగా..







మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల్లో వేసవిలో 'పీయూష్' అనే పానీయాన్ని విరివిగా తాగుతారు. దాదాపు దీని తయారీ లస్సీ మాదిరిగానే ఉంటుంది. బాగా చిలికిన పెరుగులో పంచదారతో పాటు శ్రీఖండ్ అనే సంప్రదాయ మిఠాయిని, జాజికాయ పొడి, ఏలకుల పొడి వంటివి చేర్చడం వల్ల దీనికి ఒక విలక్షణమైన రుచి ఏర్పడుతుంది. 'పీయూషం' అంటే అమృతం అనే అర్థం ఉంది. 'పీయూష్' పానీయం అమృతసమానంగా ఉంటుందని మరాఠీ, గుజరాతీ ప్రజలు చెబుతారు.ఉత్తరాది రాష్ట్రాల్లో జల్‌జీరా, ఆమ్ కా పన్నా, ఖస్‌ఖస్, రూహ్ అఫ్జా వంటి సంప్రదాయ పానీయాలను వేసవిలో విరివిగా వినియోగిస్తారు. జీలకర్ర, మిరియాలు వంటివి కలిపి తయారుచేసే జల్‌జీరాను సాధారణంగా భోజనానికి ముందు సేవిస్తారు. దీనివల్ల అలసట తీరి, ఆకలి పుడుతుందని, జీర్ణశక్తి మెరుగుపడుతుందని చెబుతారు. పచ్చి మామిడికాయలతో తయారుచేసే ఆమ్ కా పన్నా, వట్టివేళ్లు, గసగసాలు కలిపి తయారుచేసే ఖస్‌ఖస్ పానీయాలను కొన్ని ప్రాంతాల్లో ఇష్టంగా సేవిస్తారు. గులాబీరేకుల కషాయానికి చక్కెర పాకాన్ని జోడించి తయారు చేసే 'రూహ్ అఫ్జా'తో నేరుగా షర్బత్ తయారు చేసుకోవడమే కాకుండా, దీనిని లస్సీ, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్‌ల వంటి వాటిలోనూ అదనపు రుచికోసం ఉపయోగిస్తారు. ఘజియాబాద్‌కు చెందిన హఫీజ్ అబ్దుల్ మజీద్ అనే యునాని వైద్యుడు శతాబ్ది కిందట రూపొందించిన 'రూఫ్ అఫ్జా' భారత ఉపఖండమంతటా విరివిగా వినియోగంలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో చందనం పొడి, కుంకుమపువ్వు, పంచదార, నిమ్మరసం కలిపి తయారు చేసే చందన షర్బత్‌ను కూడా వేసవి పానీయంగా సేవిస్తారు. ఇవన్నీ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా, వేసవితాపాన్ని తీర్చడంలో బాగా దోహదపడతాయి. ఈ వేసవిలో మీరూ వీటి రుచులను ఆస్వాదించండి.

# తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతమే!



మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది అధిక బీపీతో బాధపడుతున్నారు. దీనిని ఆహారంతోనే అదుపు చేయవచ్చు. గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన హృదయాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

### మీకు తెలుసా?

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతం. డీ హైడ్రేషన్ వల్ల మైకం వచ్చి గుండె పనిచేయదు. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది.కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకోండి.

# చెమట కాయలా?
## చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి..



ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం. ?రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి.స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నాననిచ్చి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.వంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం.చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది. తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

## గెలిస్తే తమ గొప్పా...
# ఓడిపోతే ఈవీఎంల తప్పా....

**విజయవాడ :** ఓటమి చెందితే కాని ఈవీఎంలలో తేడా ఉన్నట్లు అర్థం కాదా? ఖచ్చితంగా తాము గెలుస్తామని భావించి ఓటమి పాలయితే దానిని ప్రజాభిప్రాయం కింద పరిగణనలోకి తీసుకోవడం లేదు మన నేతాశ్రీలు. గెలిస్తే అది మన వల్లనే అని జబ్బలు చరుచుకుంటారు. లేదంటే అవతలి వారిపై అసంతృప్తి అని చెబుతారు. అదే గెలవకుంటే మాత్రం అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించరు. నాడు చంద్రబాబు నాయుడు, నేడు వైఎస్ జగన్ ది అదే పరిస్థితి. ఎందుకంటే వారు గెలుపోటములను వెంటనే తీసుకోరు. ఆ తప్పిదాన్ని ఈవీఎంలపై నెట్టి తాము చేసిన తప్పులను మాత్రం ప్రజల దృష్టి నుంచి మరల్చేందుకు ఎక్కువ సార్లు కామెంట్స్ చేస్తుంటారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కేవలం 23 స్థానాలకే పరిమితమయింది. నిజానికి ఇంత తక్కువ స్థానాలు టీడీపీ చరిత్రలోనే రాలేదు. ఎన్నికలకు ముందు పసుపుకుంకుమలు ఇచ్చామనుకున్నారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పరుగులు పెట్టించామని భావించారు. కానీ ఓడిపోవడంతో చంద్రబాబు ఈవీఎంలను తప్పు పట్టారు. నాడు చంద్రబాబు ఒంటరిగా పోటీ చేశారు. పవన్ కల్యాణ్, బీజేపీలు వేర్వేరుగా బరిలో ఉన్నారు. కానీ జగన్ కు ఒకసారి ఇవ్వాలని భావించిన ప్రజలు ఫ్యాన్ పార్టీకే పట్టం కట్టారు. 151 స్థానాలను చరిత్రలో తొలిసారి ఒక పార్టీకి కట్టబెట్టి ఏకపక్ష తీర్పు చెప్పారు. దీంతో ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు మైండ్ బ్లాంక్ అయి ఈవీఎంలలో ఏదో తేడా ఉందన్నారు. టీడీపీ సోషల్ మీడియా కూడా అదే తరహా ప్రచారం చేసింది. 2024 ఎన్నికలు ఇప్పుడు వైఎస్ జగన్ కూడా అదే రాగం మొదలు పెట్టారు. వైసీపీకి మొన్నటి ఎన్నికల్లో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో వైఎస్ జగన్ నింద ఈవీఎంలపై నెట్టేశారు. ముందస్తు, ఎన్నికల అనంతరం సర్వేలు కూడా తమకు అనుకూలంగా వస్తే తాము ఎలా ఓడిపోగలమని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఈవీఎంలు కారణం అంటూ ఆ పార్టీ చేస్తున్న వాదనకు జగన్ కూడా మద్దతుగా నిలిచారు. బ్యాలట్ విధానమే మంచిదని అన్నారు. ప్రజాభిప్రాయం ప్రతిబింబించాలంటే ఇతర దేశాల మాదిరిగా బ్యాలెట్ పేపర్లను వినియోగించాలన్నారు.. ఇరువురు నేతలు ఒకసారి ఓడి మరొకసారి గెలిచిన వాళ్లే. ఇద్దరూ ప్రాంతీయ పార్టీలకు చీఫ్‌లే. నాడు గెలిచినప్పుడు ఈవీఎంలు బాగా పనిచేశాయని కితాబిచ్చిన నేతలు ఓటమి తర్వాత మాత్రం అవి మంచివి కావంటున్నారు. నిజానికి ఇద్దరూ తాము చేసిన స్వయంకృతాపరాధం వల్లనే ఓటమి పాలయ్యారు. అవతలి వారు గెలిచారు. అంత మాత్రాన ఎన్నికల కమిషన్ పై బురద జల్లడం ఎంత వరకూ సబబన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మాత్రం కేంద్ర ఎన్నికల కమిషన్ దే. ఎందుకంటే నెపం నెట్టింది ఈవీఎంలపైనేనా? ప్రజల దృష్టిలో దోషిగా మిగిలేది ఎన్నికల కమిషనే కావడం గమనార్హం. అందుకే ఈసీ ఈవీఎంలపై దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉంటుంది. లేకపోతే ప్రతి ఎన్నకకూ ఈవీఎం ఒక బూచిగా మారుతూనే ఉంటుంది.

# క్యాడర్‌లో కదలిక కోసం జగన్

**విజయవాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీ మారిపోతున్న నేతలు ఉన్న నియోజవవర్గాల నుంచి క్యాడర్ ను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. అలాగే జిల్లాలకు పార్టీ అధ్యక్షుల్ని కూడా నియమిస్తున్నారు. వీలైనంత వరకూ సీనియర్ నేతల్ని నియమిస్తున్నారు. అందర్నీ యాక్టివ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జనవరిలో నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. ఈ లోపు పార్టీ కార్యకర్తలకు, క్యాడర్ కు నమ్మకం కలిగించేందుకు గుడ్ బుక్ ప్రస్తావన తీసుకు వచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారందర్నీ గుర్తుంచుకుంటామని గుడ్ బుక్‌లో పేర్లు రాసుకుని అధికారంలోకి రాగానే మేలు చేస్తామని అంటున్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై భయపడకుండా పోరాడాలని పిలుపుస్తున్నారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత క్యాడర్ చాలా వరకూ సైలెంట్ అయిపోయింది. స్థానిక సంస్థల్లో ఉన్న క్యాడర్ పార్టీ మారిపోతోంది. పదవులు లేని వాళ్లు సైలెంట్ అయిపోతున్నారు. దీనికి కారణం టీడీపీని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేధించడం వల్లేనని ఇప్పుడు వారు కూడా అదేబాటలో వెళ్తే తాము తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎక్కువ మంది ఆందోళన చెందుతున్నారు. వీరందరికీ ధైర్యం ఇచ్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే లాయర్లను అందుబాటులో పెట్టారు. ఏవైనా కేసులు అయితే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు ఇప్పటికే సైలెంట్ అయ్యారు. చాలా మందిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జగన్ అందరికీ భరోసా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆయన వెంట ఉంటూ . పదేళ్ల పాటు ఆయనతో పాటు కలిసి నడిచిన వారిని అధికారంలోకి వచ్చాక జగన్ పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సోషల్ మీడియా కోసం పని చేసిన వారినీ పట్టించుకోలేదని చివరికి పెయిడ్ సోషల్ మీడియా పై ఆధారపడాల్సి వచ్చిందన్న అసంతృప్తి క్యాడర్ లో ఉంది. ఇక ద్వితీయ శ్రేణి నేతలు తమను జగన్ పూర్తిగా రోడ్డున పడేశారని అనుకున్నారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ తీసుకు రావడం వల్ల పాలనలో పార్టీ క్యాడర్ కు పని లేకుండా పోయింది. జగన్ కూడా వాలంటర్లకే ప్రాధాన్యం ఇచ్చారు. వారినే లీడర్లను చేస్తామని కూడా ప్రకటించారు. ఈ పరిణామాలతో గత ఎన్నికల్లో క్యాడర్ కూడా వైసీపీకి గట్టిగా పని చేయలేదన్న వాదన ఉంది. ఆ అసంతృప్తిని జగన్ గమనించారని అందుకే గుడ్ బుక్ అని చెబుతున్నారు. జగన్ బయటకు రాకుండా పార్టీ క్యాడర్ ను మాత్రమే తెరపైకి వచ్చేలా చేయడానికి ప్రయత్నిస్తే ఆ వ్యూహం ఫెయిల్ అవుతుందని జగన్ నాయకుడిగా ముందుండి నడిపిస్తేనే ప్రయోజనం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి జనవరి నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటనలకు రెడీ అవుతున్నారని చెబుతున్నారు. వైసీపీ హయాంలో నారా లోకేష్, చంద్రబాబు పర్యటనల సమయంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడేవి. జగన్ పర్యటనలో అలాంటివి ఏర్పడినా జగన్ ముందుకు వెళ్తే.. ప్రభుత్వాన్ని ఎదిరించవచ్చని.. గొడవలు జరుగుతాయని అనుకుని ఆగిపోతే క్యాడర్ లో ధైర్యం రాదని చెబుతున్నారు. మొత్తంగా జగన్ పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేసేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని అనుకోవచ్చు.

# ఏపీలో భారీగా మద్యం దరఖాస్తులు

**విజయవాడ :** కొత్త షాపులు, కొత్త బ్రాండ్లు, కొత్త ధరలు, కొత్త మద్యం, కొత్త విధానం రాబోతోంది. ఏపీలో మద్యం షాపులకు విదేశాల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. యూరప్, అమెరికా నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు నమోదయ్యాయి. అమెరికా నుంచి 20 అప్లికేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మద్యం షాపుల టెండర్లకు సంబంధించి దరఖాస్తు గడువు సమీపిస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది దరఖాస్తులు వేస్తున్నారు. ఇప్పటివరకు 70వేలకు పైగా టెండర్లు వచ్చినట్లుగా తెలుస్తోంది. దాదాపుగా 1500 కోట్ల రూపాయలకుపైగా డిపాజిట్లు వచ్చినట్లుగా సమాచారం.

ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది.ఏపీలో మద్యం దుకాణాల కోసం ప్రవేశపెట్టిన కొత్త విధానం. ఏపీలో మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పటికే దరఖాస్తులను కూడా స్వీకరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కొత్త మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు.. కోకొల్లలు వస్తున్నాయని చెప్పవచ్చు. అయితే ఈ దరఖాస్తులు సమర్పించేందుకు ఎవరైనా నాన్ రిఫండబుల్ ఫీజు అక్షరాలా రూ. 2 లక్షలు చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3,396 దుకాణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులను 14వతేదీన అందరి ముందు ఎక్సైజ్ అధికారులు లాటరీ తీసి, దుకాణదారులను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి.

కాగా ఈ నెల 16 నుండి ఈ ప్రక్రియతో ప్రారంభమయ్యే మద్యం షాపులు ప్రారంభం కావచ్చు. అయితే.. దరఖాస్తు గడువును ప్రభుత్వం పెంచే అవకాశాలు ఉన్నట్లు కూడా వార్తలు హల్ చల్ చేస్తున్నాయి.అయితే ఎలాగైనా మద్యం షాపును చేజిక్కించుకోవాలనుకున్న వ్యాపారస్తులు.. తమ దరఖాస్తులను తమ పేరిట.. అలాగే కుటుంబ సభ్యుల పేరిట కూడా అందించి.. తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారట. అసలే ఆదాయం లేని ప్రభుత్వానికి ఈ మద్యం స్కీం.. ఆదాయాన్ని బాగానే తెచ్చిపెడుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం సుమారు 42 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని.. దీనితో సుమారుగా రూ. 830.96 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని తెలుస్తోంది.

అయితే ఇక్కడే సూపర్ ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఏపీలోని మద్యం షాపులకు కేవలం రాష్ట్ర ప్రజల నుండే కాకుండా.. విదేశాల నుండి కూడా దరఖాస్తులు వస్తున్నాయట. మద్యం షాపుల కోసం యూరప్, అమెరికా దేశాలలో ఉన్న ప్రవాసాంధ్రులు కూడా తమ దరఖాస్తులను ఎక్సైజ్ శాఖకు పంపిస్తున్నారని అధికారులు తెలుపుతున్నారు.

అమెరికా నుండి తమకు 20 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి తెలిపారు.ఏపీ మద్యం కొత్త పాలసీ క్రేజ్ విదేశాలకు కూడా పాకిందంటే.. అసలు మద్యం షాపుల ఏర్పాటుకు ఔత్సాహికులు ఏవిధంగా ముందుకు వస్తున్నారో చెప్పనవసరం లేదు. ఏది ఏమైనా.. కూటమి ప్రభుత్వం మందుబాబులకు కూడా ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించింది. అసలుసిసలైన బ్రాండ్ మద్యం మీ చెంతకు చేరుస్తాం.. ధరలు తగ్గిస్తాం అంటూ మందుబాబులపై వరాలజల్లు కురిపించింది. అందుకే మందుబాబులు కూడా హమ్మయ్య.. త్వరగా లాటరీ తీయాలి.. ఇక బ్రాండెడ్ కిక్కు కావాలనే రీతిలో.. కొత్త మద్యం షాపుల కోసం వెయిటింగ్ లో ఉన్నారట.

# రోజా కంటే శ్యామలే బెటరా....

**తిరుపతి :** మాజీ మంత్రి రోజా సెల్వమణి వైసీపీ నేతల్లో ప్రస్తుతం అంతో ఇంతో యాక్టివ్‌గా ఉన్న నేతల్లో ఒకరు ? పార్టీ ఓటమి తర్వాత బూతు మంత్రులు అనిపిచున్న వారంతా తెరమరుగైపోయినా? రోజా మాత్రం అప్పుడప్పుడు మీడియాలో ఫోకస్ అవుతున్నారు ? అయితే రికార్డెడ్ వీడియోస్ రిలీజ్ చేస్తూ, ట్వీట్లకే పరిమితమవుతున్నారు .. దాంతో అసలు ఆమె ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుపట్టకుండా తయారైంది? ఒకవైపు యాంకర్ శ్యామల వంటి వారు వైసీపీ అధికార ప్రతినిధి హోదాలో మీడియా ముందుకొస్తున్నా? రోజా మీడియాకు ముఖం చాటేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోని పుంగనూరులో బాలిక అదృశ్యమై హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ ఘటనపై తక్షణమే స్పందించిన ప్రభుత్వం హత్యకు కారణాలు గుర్తించి.. నిందితులను అరెస్ట్ చేయడంలో సక్సెస్ అయింది. ఆ బాలికను ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య చేశారని పోలీసులు ప్రకటించినా.. వైసీపీ నేతలు మాత్రం బాలికపై అత్యాచారం జరిగిందని రాద్దాంతం చేశారు. కక్షపూరితంగా జరిగిన ఆ హత్యకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశారు.ఈ ఘటనపై మాజీ మంత్రి రోజా.. ప్రీ రికార్డెడ్ వీడియో రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాల్లో చిన్నారులకు రక్షణ లేకుండా పోతుందని.. ఆడపిల్లలను స్కూళ్లకు పంపించాలంటే తెగ భయమేస్తుందని తెగ ఆవేదన వ్యక్తం చేశారు. సీన్ కట్ చేస్తే పుంగనూరు బాలిక హత్యపై అంత రాద్ధాంతం చేసిన వైసీపీ యూటర్న్ తీసుకుంది? బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి వైసీపీ అధ్యక్షుడు జగన్ వస్తున్నారని ప్రకటించిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరుసటి రోజే జగన్ టూర్ రద్దైందని ప్రకటించారు. ప్రభుత్వం ఆ ఘటనపై సకాలంలో స్పందించిందని, అందుకే జగన్ పర్యటన రద్దు చేసుకున్నారని వివరణ ఇచ్చారు.పెద్దిరెడ్డి అంత క్లారిటీ ఇచ్చినప్పటికీ రోజా తిరిగి ఆ ఘటనపై స్పందించలేదు. ఇంతలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం ఘటన వెలుగు చూసింది. బాలిక అపస్మారక స్థితికి చేరుకోవడంతో నిందితులు ఆమెను తిరిగి ఆటోలో ఎక్కిస్తుండగా, స్థానికులు పట్టుకుని వారిని పోలీసులకు అప్పగించారు. బాలిక బంధువు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదులోకి తీసుకున్నారు. దానిపై రోజా ట్విట్టర్లో స్పందించారు.'డిప్యూటీ సీఎం సొంత ఇలాఖాలోనే ఓ మైనర్ బాలికపై దారుణం జరిగితే చర్యలు లేవు” అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు రోజా. అంతకు ముందు వరదల సమయంలో కూడా రోజా ప్రభుత్వ సహాయక చర్యలపై అవగాహన లేకుండా విచిత్రమైన వ్యాఖ్యలు చేశారు. సీఎం సహా మంత్రులు వరద నీటిలో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తుంటే. ప్రభుత్వ పెద్దలపై అనుచిత వ్యాఖ్యలు చేసి విమర్శలు మూట గట్టుకున్నారు.తర్వాత తిరుమల లడ్డూ వివాదంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడి విమర్శలు మూట గట్టుకున్నారు స్పాట్ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రోజా నోటి దూకుడు ఏ స్థాయిలో ఉండేదో అందరికీ తెలిసిందే.

ఆ నోటి దూకుడు పార్టీకి తీవ్ర నష్టం చేసిందని వైసీపీ నేతలే అంటున్నారు. అందుకే ఆమెకు జగన్ అధికార ప్రతినిధి హోదా కూడా ఇవ్వలేదని, అందుకే ఆమె ఉనికి కోసం రికార్డెడ్ వీడియోలు రిలీజ్ చేస్తూ.. ఎక్స్ వేదికగా రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రోజా కంటే రాజకీయాల్లో జూనియర్లు, అసలు రోజాకు ఏ రకంగా సమఉజ్జీ కాని యాంకర్ శ్యామల వంటి వారి వైసీపీలో అధికార ప్రతినిధి హోదా దక్కింది. శ్యామల రాజకీయంగా ఉనికి చాటుకోవడానికి ప్రెస్ మీట్లు పెడుతూ హడావుడి చేయాలని చూస్తున్నారు. అయితే సొంత సెగ్మెంట్ నగరిలో కనీసం అడుగుపెట్టలేకపోతున్న రోజా ఓటమి తర్వాత తెరచాటు రాజకీయాలకే పరిమితమవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.

# ప్రైవేట్ కు రుషికొండ ప్యాలెస్

**విశాఖపట్టణం :** జిల్ జిగేల్‌మంటూ శ్వేతవర్ణంతో మెరిసిపోతున్న భవంతులు.. పెద్ద పెద్ద ప్రవేశ ద్వారాలు.. విశాలమైన బెడ్రూమ్స్, అందుకు ఏ మాత్రం తీసిపోని స్నానాల గదులు, అత్యంత ఖరీదైన మంచాలు, పరుపులు, బాత్ టబ్‌లు, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియర్లతో మెరిసిపోయే ఆ వైభోగాన్ని కళ్లారా చూడాల్సిందే తప్ప వర్ణించలేం.ప్రభుత్వ ఖర్చులతోనే నిర్మించిన ఆ కట్టడం ఓ రాజభవనం. ఏ వైట్‌హౌస్ లోపలికో, బకింగ్‌హాం ప్యాలెస్‌లోకో అడుగుపెట్టిన ఫీలింగ్ కలుగుతుంది. అవే రుషికొండ సౌధం. గత వైసీపీ హయాంలో భీమిలి బీచ్ రోడ్డులో సముద్రాన్ని ఆనుకుని రుషికొండపై కట్టిన భవంతుల చుట్టూ ఇప్పటికీ వివాదం కొనసాగుతోంది.రూ.500 కోట్లతో అత్యంత విలాసవంతంగా నిర్మించిన ఆ భవనాల్ని ఇప్పుడేం చేస్తారన్న చర్చ మొదలైంది. రాష్ట్రపతి, ప్రధానితో పాటు ప్రముఖులు వచ్చినప్పుడు అతిథి గృహాలుగా వాడేందుకు కట్టామని వైసీపీ నేతలు చెప్తున్నారు. అయితే అంత వివాదం అయినా అప్పుడు ఎందుకు ఈ విషయాన్ని చెప్పలేదని టీడీపీ ప్రశ్నిస్తోంది.వైఎస్ జగన్ ఉండటం కోసమే రుషికొండ ప్యాలెస్‌ను కట్టారని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు రుషికొండ భవనాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై కూటమి సర్కార్ తర్జనభర్జన పడుతోంది. ప్రభుత్వ అవసరాలకే వాడుకుందామా లేక ప్రైవేటుకు ఇద్దామా అనేదానిపై ఇంటర్నల్‌గా చర్చలు జరుపుతోంది పర్యాటకశాఖపై సీఎం చంద్రబాబు పలుసార్లు రివ్యూలు చేసినా ఈ అంశం ప్రస్తావనకు రాలేదు. మంత్రులు దుర్గేశ్, లోకేశ్ విశాఖలో పర్యటించినా రుషికొండ భవనాన్ని సందర్శించలేదు. పర్యాటక శాఖ మంత్రి అయితే అది మ్యూజియంగా తప్ప దేనికి పనికిరాదంటున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్తున్నారు.అయితే ఇప్పటికే ఖాళీగా ఉన్న ఈ భవనాల నిర్వహణకు ప్రతి నెలా లక్షల్లో ఖర్చవుతోంది. నిర్వహణ సామర్థ్యం, నైపుణ్యం ఉన్న సిబ్బంది లేరు. వీటిని రిసార్టులుగా మార్చాలన్నా అక్కడి నిర్మాణాలు అందుకు తగ్గట్లు లేవు. దీంతో వచ్చే ఆదాయం కన్నా నిర్వహణ భారం ఎక్కువవుతుందని భావిస్తున్నారు. అందుకే రుషికొండ భవనాలను ఏం చేయాలనే దానిపై ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోందిరుషికొండపై 9.88 ఎకరాల్లో 7 భవనాలు నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలతో కట్టిన ఈ భవనాల నిర్వహణకే ప్రతిరోజు లక్ష వరకు ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ నిపుణుల అంచనా వేస్తున్నారు. ఈ భవనాలను పూర్తిస్థాయిలో వాడటం మొదలుపెడితే 100 మంది వరకు సిబ్బంది అవసరమని చెప్తున్నారు. మరో 50 మంది షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుందని.. ఇప్పటికే కొన్ని వస్తువులు పాడైనట్లు చెబుతున్నారు.ఇక రుషికొండ భవనాలకు విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఐదు నెలల్లో ప్రతి నెలా సగటున 6 లక్షలపైనే బిల్లు వచ్చింది. ఇప్పటివరకు 85 లక్షల విద్యుత్ బిల్లు బకాయి ఉంది. ఖాళీగా ఉన్న భవనాలకే ప్రతినెలా 40 వేల నుంచి 60 వేల యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. అదే వినియోగంలోకి వస్తే ఇది రెండింతలు అవుతుందని అంచనా.భవనాల దగ్గర 10వేల 4 చదరపు మీటర్లలో 58 రకాల మొక్కలు నాటారు. వీటిలో చాలావరకు విదేశాల నుంచి తెచ్చినవే. వాటి నిర్వహణ సరిగ్గా లేక చాలా మొక్కలు ఎండిపోయాయి. అయితే విలువైన ప్రభుత్వ ఆస్తిని నిరుపయోగంగా ఉంచడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

# సొంత జిల్లాలో వైసీపీకి నేతల కరువు

**కడప :** దప జిల్లా అంటేనే వైసీపీ అధినేత సొంత జిల్లా. దాని పేరే వైఎస్సార్ కడప జిల్లాలో అలాంటి కడప జిల్లాలో వైసీపీ ఆపసోపాలు పడుతుంది. సరైన నాయకత్వం జిల్లాలో కొరవడింది. దీంతో అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్ కుటుంబానికి ఆ జిల్లా దూరమవుతున్నట్లే కనపడుతుంది. నాయకత్వ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అధికారం ఉన్నప్పుడు అందరూ నాయకులే. కానీ రాష్ట్రంలో అధికారం లేనప్పుడు మాత్రం ఎవరూ పార్టీని పట్టించుకోవడం లేదు. పార్టీకి పెద్ద దిక్కు అనేది లేకుండా పోయింది. దీంతో వైసీపీ క్యాడర్ కకావికలమవుతుంది. ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు కూడా పార్టీని వీడి వెళ్లిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.గత అసెంబ్లీ ఎన్నికల్లోనే కడప జిల్లాలో వైసీపీ దారుణమైన ఫలితాలను చూసింది. 2019 ఎన్నికల్లో పది స్థానాలకు గాను పదింటిని గెలుచుకున్న వైసీపీ 2024 ఎన్నికల్లో మాత్రం మూడు స్థానా?లకే పరిమితమయింది. ఇది చాలదూ వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీ పతనమయిందనడానికి ఉదాహరణ. తర్వాత జడ్.పి. ఛైర్మన్ పదవి పోకుండా ఎలాగోలా కాపాడుకోగలిగారు. అదీ వైఎస్ జగన్ ఇన్ వాల్వ్ అయి వారితో సమావేశమయి కొంత భరోసా ఇవ్వడంతో జడ్పీ ఛైర్మన్ పదవి కోల్పోలేదు. అన్ని నియోజకవర్గాల్లో బలమైన నేతలున్నారు. ఇప్పుడు సిట్టింగ్ పార్లమెంటు సభ్యుడిగా వైఎస్ అవినాష్ రెడ్డి ఉన్నారు. అయినా ఎవరూ పార్టీని పట్టించుకోవడం లేదునియోజకవర్గంలో నేతలు పట్టించుకోక పోవడంతో పార్టీని వదలి ద్వితీయ శ్రేణి నేతలు వదలి వెళ్లిపోతున్నారు. టీడీపీ క్షేత్రస్థాయిలో బలం పుంజుకునే దిశగా అడుగులు వేస్తుంది. జగన్ కూడా బెంగళూరు – తాడేపల్లి మధ్య చక్కర్లు కొడుతుండటంతో ఇక నేతలు కూడా పట్టించుకోవడంలేదు. జమ్మలమడుగు వంటి పట్టున్న నియోజకవర్గంలోనూ పూర్తిగా పార్టీని ఇన్ ఛార్జి సుధీర్ రెడ్డి వదిలేశారు. అయన నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. దీంతో అక్కడ క్యాడర్ కూడా అయోమయంలోనే ఉంది. అక్కడ రామసుబ్బారెడ్డికి పార్టీ బాధ్యతలను అప్పగించాలని వైసీపీ అధినాయకత్వం భావిస్తుంది. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదుఇక కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీ నుంచి వెళ్లిపోయారు. టీడీపీ ఖాతాలోకి కమలాపురం మున్సిపాలిటీ దాదాపుగా వెళ్లిపోయింది. ఛైర్మన్ తో పాటు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. జగన్ మేనమామ కమలాపురం నియోజకవర్గానికి మొన్నటివరకూ ప్రాతినిధ్యం వహించారు. వైసీపీ బలం ఎనిమిదికి పడిపోవడంతో అక్కడ వైసీపీ వీక్ అయింది. కౌన్సిలర్లు వెళ్లిపోతున్నా అక్కడ పట్టించుకునేందుకు ఎవరూ లేరు. ఏ నేత ప్రయత్నించకపోవడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. ఇలా కడప జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో అదే పరిస్థితి నెలకొంది. మరి జగన్ రంగంలోకి దిగుతారా? లేదా? అన్నది చూడాలి.

# దుర్గమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు

**హైదరాబాద్** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో దుర్గాదేవి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ప్రతి సంవత్సరం అమ్మవారిని ప్రతిష్ఠిస్తారు..నవరాత్రులు అమ్మవారికి ఇష్టంగా పూజలు నిర్వహిస్తారు అలాంటి అమ్మవారిపై కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసారు. అమ్మవారి విగ్రహం చెయ్యి విరగ గొట్టి అక్కడ పడేశారు... ద్వీపం ఆర్పేసి , మండపం చిందరవందర చేసారు. మండపం నిర్వాహకులు బేగం బజార్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మొదటగా కరెంట్ కటచేసి,సీసీ కెమెరాలు విరగగొట్టిన అనంతరం విగ్రహం చేతిని విరగకొట్టి,పూజ సమాన్ అంత చుట్టూ పడవేసి,అమ్మవారి చుట్టూ ఉన్న బరికేడ్స్ కూడా తొలగించిన దుండగులు ప్రతి సంవత్సరం ఎక్కడో ఒక వద్ద హిందు ఆరాధ్య విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని భక్తుల ఆవేదనతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, విగ్రహం పై దాడి చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పలు హిందు

## ఔట్ డోర్ ప్రోగ్రాంలు వద్దు..
# సోషల్ మీడియా ముద్దు..

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సోషల్ మీడియా ఎప్పుడో వేదికై పోయింది.ఏపీ రాజకీయాల్లో పొలిటికల్ కన్సల్టెంట్ల ప్రయేయం మొదలయ్యాక అధికారాన్ని చేరుకోడానికి, అధికారాన్ని నిలబెట్టుకోడానికి సోషల్ మీడియానే వేదికగా మారింది. ముసుగు ముఖాలతో సోషల్ మీడియాలో చేసే ప్రచారమే పార్టీలకు ఊపిరి పోస్తోంది. అన్ని పార్టీలు కొన్నేళ్లుగా ఇదే పంథాలో పయనిస్తున్నాయి.ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న వైసీపీ వేగంగా తేరుకున్నట్టు కనిపిస్తోంది. నెలన్నర లోపే వైసీపీ సోషల్ మీడియా ఖాతాలను ఆ పార్టీ యాక్టివేట్ చేసుకుంది. మొదట్లో కొన్నాళ్లు తాడేపల్లిలోని జగన్ నివాసం సమీపంలోని విల్లాల్లో ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకలాపాలను నిర్వహించారు. పోలీస్ కేసులు, సాంకేతిక కారణాలతో మరో ప్రాంతానికి తమ బృందాలను ఆ పార్టీ తరలించేసింది.అధికారానికి దూరమైన తర్వాత వైసీపీ అధ్యక్షుడు తరచూ బెంగుళూరు వెళ్లిపోతున్నా పార్టీ శ్రేణులకు, గతంతో పోలిస్తే వీలైనంత ఎక్కువగానే అందుబాటులో ఉంటున్నారు. మొదట్లో పార్టీ కార్యకర్తల ఆందోళనలు, నిరసన స్వరాలు వినిపించడంతో కార్యకర్తలతో కలవడానికి కూడా ఆ పార్టీ అధినేత విముఖత చూపించారు. పార్టీ శ్రేణుల్ని కలిసే కార్యక్రమాలకు స్వస్తి పలికారు. ?ఆ తర్వాత అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నారు.వైసీపీ ముఖ్య నేతల వ్యవహార శైలిపై ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి ఉన్నా, సోషల్ మీడియాలోనే ఎక్కువగా రీచ్ వస్తుందని ఆ పార్టీ బాధ్యులు అభిప్రాయపడుతున్నారు. బహిరంగ కార్యక్రమాలు చేపడితే నేతలు సొంతంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందనే ఆందోళన కూడా మరో కారణమని చెబుతున్నారు.వినుకొండలో జరిగిన వైసీపీ సానుభూతిపరుడు రషీద్ హత్య, జైల్లో నందిగం సురేష్ పరామర్శ, వరద బాధితులు, వైసీపీ ముఖ్యనాయకులకు అనారోగ్యం నేపథ్యంలో పరామర్శ వంటి కార్యక్రమాలను జగన్ నిర్వహించారు. ఈ క్రమంలో గత నెలలో వచ్చిన వరద సహాయక చర్యల్లో అధికార పార్టీ విఫలమైందని విస్తృత ప్రచారం చేసింది.వరద బాధితులకు సహాయక చర్యలు, నష్టపరిహారం చెల్లింపు విషయంలో క్షేత్ర స్థాయిలో పోరాటాలు సీపీఎం చేస్తే సోషల్ మీడియా వాటిని ప్రచారాస్త్రాలుగా వైసీపీ మార్చుకుంది. బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో జరిగిన లోపాలను గణాంకాలతో సీపీఎం నాయకులు ఎండగట్టారు. సీపీఎం ఆందోళన నేపథ్యంలోనే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ విడుదల చేసిన వివరాలతో వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో చెలరేగిపోయారు.మొదట్లో వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కూటమి ప్రభుత్వం భావించింది. చివరకు బాధితులకు చెల్లించిన నష్టపరిహారం కంటే వరద సహాయక చర్యల పేరిట చేసిన ఖర్చు ఎక్కువ ఉందని జనంలోకి బలంగా వెళ్లడంతో ప్రభుత్వం చేసిన సాయం మొత్తం కొట్టుకుపోయింది. చివరకు మంత్రులు అంతా క్యూ కట్టి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.మరోవైపు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విషయంలో ప్రతిపక్షానికి ఉండే అవకాశాలను వైసీపీ అందిపుచ్చుకుంటోంది. అదే సమయంలో క్షేత్ర స్థాయిలో మాత్రం వైసీపీ తాజా మాజీ నాయకుల ఉనికి ఎక్కడా కనిపించడం లేదు. నిన్న మొన్నటి వరకు అధికారాన్ని ఎంజాయ్ చేసిన నేతలంతా పవర్ పోగానే ఎక్కడి వారు అక్కడ సర్దుకుంటున్నారు.మంత్రి పదవుల్ని అనుభవించిన వారు, అధికారంలో ఉండగా అప్పటి ప్రతిపక్ష టీడీపీపై నోరు పారేసుకున్న నాయకులు ఎక్కడా చప్పుడు చేయడం లేదు. కేవలం సోషల్ మీడియాలో ముఖాలు లేని ఖాతాలతో పాటు ఆ పార్టీలో మొదటి నుంచి సాగుతున్న వాళ్లు మాత్రమే సోషల్ మీడియాలో కనిపిస్తున్నారు. పార్టీతో ప్రయోజనం పొందిన వాళ్లంతా తమకెందుకు అనవసర వివాదాలని భావిస్తున్నారు.గతంలో వైసీపీ హయంలో సోషల్ మీడియా కోసం పనిచేసిన వారిలో ఎంపిక చేసుకున్న వారిని పార్టీ సొంత ఖర్చులతో ఆన్‌లైన్ ప్రచారానికి వినియోగించు కుంటున్నట్టు తెలుస్తోంది. తక్కువ ఖర్చుతో పార్టీ కార్యక్రమాలను యాక్టివ్‌గా ఉంచడమే లక్ష్యంగా వైసీపీ సోషల్ మీడియా బృందాలు పనిచేస్తున్నాయి.ముఖ్యమైన నాయకులు ఎవరు ఇప్పట్లో సొంత డబ్బులతో పార్టీ కార్యక్రమాలు చేసే పరిస్థితులు లేకపోవడంతో అప్పటి వరకు సోషల్ మీడియా ప్రచారంతో సరిపెట్టుకోవాలని వైసీపీ ఆలోచనగా కనిపిస్తోంది. కనీసం కమ్యూనిస్టు పార్టీల తరహాలో కూడా నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న పార్టీ, రాజకీయ కార్యక్రమాలను నిర్వహించలేకపోవడం కూడా లోటుగా కనిపిస్తోంది.

# కొత్త సిలబస్ తోనే టెన్త్ పరీక్షలు

**గుంటూరు :** రాష్ట్రంలో గత మూడేళ్ల విద్యార్థులకు పాత సిలబస్‌తోనే పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వెబ్‌సైట్‌లో ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు, మార్కుల వెయిటేజీ వంటి అప్‌లోడ్ చేశారు.పదో తరగతి 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు పాత సిలబస్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. ఆ మూడు సంవత్సరాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఈ ఏడాది ఫెయిల్ అయిన సబ్జెట్ల రాయలనుకుంటే వారు పాత సిలబస్ ప్రకారమే రాయడానికి అవకాశం ఉంది. ప్రైవేట్, రీ ఎన్‌రోల్ చేసుకున్న విద్యార్థులు, ఆయా సంవత్సరాల్లో ఏ సిలబస్ ప్రకారం అయితే పరీక్షలు రాశారో, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో కూడా వారికి పాత సిలబస్ వర్తిస్తుంది.ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25) పదో తరగతి విద్యార్థులకు మాత్రం మారిన కొత్త సిలబస్ ప్రకారం పబ్లిక్ పరీక్షలు ఉంటాయి. అందుకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు, బ్లూ ప్రింట్, ఏడు పేపర్లకు సంబంధించి ప్రశ్నల వారీగా మార్కుల వెయిటేజీ, మోడల్ పేపర్లను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ లో ఉంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2024-25 పదో తరగతి విద్యార్థులకు కొత్త సిలబస్ ప్రకారమే పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు.

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి హిందీ పేపర్‌పై సమీక్షించి, సవరణ చేశారు. ఈ సవరణ చేసిన హిందీ పేపర్‌ను కూడా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేశారు.సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ప్రముఖ ప్రైవేట్ శిక్షణా సంస్థల నుండిచ ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి ఈ టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే సాంఘిక్ష సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి ఉన్న శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలనే నిబంధన ఉంది. అలాగే ఆ సంస్థ ద్వారా వంద మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉండాలి. మూడేళ్ల టర్నోవర్ సరాసరి రూ.40 లక్షలు ఉండాలి. ఆసక్తి ఉన్న డీఎస్సీ శిక్షణా సంస్థలు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైనల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునేందుకు అందుబాటులో వెబ్‌సైట్ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి ఈ ఉచిత డీఎస్సీ శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ విధానంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో అత్యున్నత శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## స్వయంభూ సెట్‌లో..
# ఆయుధపూజ




నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. భారీ బ్జడెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా చిత్రబృందం దీనిని రూపొందిస్తోంది. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని తాజాగా ఈ సినిమా సెట్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. సినిమాలో ఉపయోగిస్తోన్న ఆయుధాలన్నింటికీ పూజ చేశారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. దసరా శుభాకాంక్షలు తెలియజేసింది.

# జిగ్రాలో నీ నటన అమోఘం


### - నువ్వు కేక..అలియాకు రష్మిక కితాబు

బాలీవుడ్ నటి అలియాభట్ పై నటి రష్మిక ప్రశంసల వర్షం కురిపించారు. యాక్టింగ్‌లో అలియా టాలెంట్, కథల ఎంపికను ఆమె మెచ్చుకున్నారు. విభిన్నమైన కథలను తరచూ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు తాజాగా ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా పోస్ట్ పెట్టారు. అలియా భట్, వేదాంగ్ నటించిన 'జిగ్రా' చూశా. సినిమా అద్భుతంగా ఉంది. నటీనటులు, చిత్రబృందాన్ని గట్టిగా హత్తుకుని మెచ్చుకోకుండా ఉండలేకపోయా. అలియా.. నువ్వు మాకు దొరకడం ఓ వరం. నీ టాలెంట్‌ని చూసే అవకాశం మాకు ఇచ్చినందుకు థాంక్యూ. వేదాంగ్ నువ్వు మరెన్నో చిత్రాలు నటిస్తే చూడాలనుకుంటున్నా. రాహుల్.. నువ్వు నన్నెంతో సర్‌ప్రైజ్ చేశావు. నీకు, 'జిగ్రా'లో నువ్వు పోషించిన మత్తు పాత్రకు చాలా వ్యత్యాసం ఉంది. వాసన్ బాలా.. మేకింగ్ చాలా బాగుంది. ఇంకెన్నో విషయాలు చెప్పాలని ఉంది. చిత్రబృందం మొత్తానికి నా అభినందనలు అని రష్మిక రాసుకొచ్చారు. బాలీవుడ్ నటీనటులు అలియాభట్ , వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా' యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత. తమ్ముడు కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో ఇది సిద్ధమైంది. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. సినీ తారల కోసం ముంబయిలో 'జిగ్రా' స్పెషల్ షో వేశారు. దీనికి రష్మిక హాజరైన విషయం తెలిసిందే. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రానా తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. సినిమా విడుదల సందర్భంగా మహేశ్‌బాబు చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.



# రొటీన్ కథల నుంచి బయటపడని శ్రీనువైట్ల

## విశ్వం మూవీలో కనిపించని కొత్తదనం




నటుడు గోపీచంద్.. దర్శకుడు శ్రీను వైట్ల ఇద్దరూ కొన్నాళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న క్రమంలో... ఇప్పుడీ ఇద్దరూ కలిసి విజయమే లక్ష్యంగా 'విశ్వం'తో విజయదశమి బరిలో నిలిచారు. ఇది వీళ్ల కాంబోలో తొలి సినిమా. ఇప్పటికే దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అసలు కథేంటంటే.. జలాలుద్దీన్ ఖురేషి (జిషు సేన్) కరుడుగట్టిన ఐఎస్ఐ టెర్రరిస్ట్. సంజయ్ శర్మ అనే మారుపేరుతో భారత్‌లో నివసిస్తూ.. విద్యా వ్యవస్థ ముసుగులో విద్యార్థుల్ని తీవ్రవాదులుగా తయారు చేస్తుంటాడు. వాళ్ల సాయంతో పెద్ద ఎత్తున మారణహోమం సృష్టించి భారత్‌ను నాశనం చేయాలని ప్రణాళిక రచిస్తుంటాడు. దీనికోసం కేంద్రమంత్రి సీతారామరాజు (సుమన్) సోదరుడైన బాచిరాజు (సునీల్) సాయం తీసుకుంటాడు. కానీ, తన ఉగ్రచర్యల సంగతి సీతారామరాజుకు తెలియడంతో బాచిరాజుతో కలిసి అతన్ని జలాలుద్దీన్ కిరాతకంగా చంపేస్తాడు. ఈ హత్యను దర్శన అనే ఓ చిన్న పాప చూస్తుంది. దీంతో ఆ పాపను కూడా చంపాలని బాచిరాజుతో చెప్పి ఓ పని మీద కశ్మీర్‌కు వెళ్తాడు జలాలుద్దీన్. అయితే బాచిరాజు ముఠా ఆ పాపను చంపబోగా ఆ చిన్నారి కుటుంబానికి గోపిరెడ్డిగా పరిచయమైన విశ్వం (గోపీచంద్) కాపాడతాడు. శ్రీను వైట్ల చిత్రాల్లో కథలు ఓ థీమ్‌లో సాగుతుంటాయి. దేశానికి కొన్ని విద్రోహ శక్తుల నుంచి ముప్పు ఏర్పడటం.. ఆ కుట్రల్ని భగ్నం చేసేందుకు హీరో తన ఐడింటిటీని దాచి పెట్టి మారుపేరుతో ఓ ఇంటిలో చేరి రహస్యంగా మిషన్‌ను చేపట్టడం.. ఈ క్రమంలో తన తెలివితేటలతో ఆ విద్రోహ శక్తుల్ని తన ట్రాప్‌లో పడేలా చేసి వాళ్ల ఆట కట్టించడం కనిపిస్తుంటుంది. శ్రీను వైట్ల నుంచి వచ్చిన 'దూకుడు', 'బాద్‌షా' చిత్రాలు ఈ కోవకు చెందినవే. ఈ థీమ్ రొటీన్‌గా మారిపోవడంతో శ్రీనుకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. అందుకే ఈసారి తన పంథాను పూర్తిగా మార్చుకుని.. ఈతరం ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం నిండిన కథతో 'విశ్వం'ను సిద్ధం చేసినట్లు ప్రచార కార్యక్రమాల్లో చెప్పారు. కానీ, తెరపై సినిమా చూస్తున్నప్పుడు ఆయన ఇంకా తన పాత పంథా నుంచి అసలు బయటకు రాలేదనే అనిపిస్తుంది. ఈ చిత్రాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే 'దూకుడు'కు గోపీచంద్ వెర్షన్‌లా ఉంటుంది. మహేశ్‌బాబు 'దూకుడు'లో తండ్రి ఎమోషన్‌ను కనిపిస్తే.. ఇందులో ఓ పాప ఎమోషన్ కీలకంగా నిలుస్తుంది. మిగతాదంతా శ్రీను వైట్ల మార్క్ వినోదం.. గోపీచంద్ శైలి యాక్షన్ హంగామాతో రొటీన్‌గానే సాగిపోతుంది. ద్వారకలో జరిగే బాంబు బ్లాస్ట్ ఎపిసోడ్‌తో సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే జలాలుద్దీన్ పాత్రను పరిచయం చేసి నేరుగా కథలోకి తీసుకెళ్లిపోయారు దర్శకుడు. కథలో సీరియస్‌నెస్ మిస్సయిపోతుంది. ఇక్కడి నుంచి శ్రీను వైట్ల మార్క్ వినోదం మొదలవుతుంది. జాలిబాబుగా పృథ్వీ చేసే అల్లరి.. మ్యారేజ్ బ్రోకర్‌గా శ్రీనివాస్ కామెడీ ట్రాక్ ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయి. ఇక నాయకా నాయికల మధ్య వచ్చే ఇటలీ లవ్‌ట్రాక్ ఎపిసోడ్ బోరింగ్‌గా అనిపిస్తుంది. పాపను చంపేందుకు బాచిరాజు మళ్లీ కుట్ర మొదలు పెట్టినప్పటి నుంచి కథలో సీరియస్‌నెస్ మొదలవుతుంది. ఈ క్రమంలో గోవా నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌తో విరామమిచ్చిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. గోపీచంద్ ఎప్పటిలాగే తనకు అలవాటైన యాక్షన్ పాత్రలో చక్కగా ఒదిగిపోయారు. యాక్షన్, కామెడీ సీక్వెన్స్‌లలో తనదైన శైలిలో చెలరేగిపోయారు. కావ్య థాపర్ తెరపై తన అందచందాల తో గ్లామర్‌గా కనిపించింది. తన పాత్ర నిడివి కూడా ఎక్కువగా ఉంటుంది. డ్యాన్సుల్లో ప్రతిభ చూపే అవకాశం దొరికింది. కాకపోతే నటన పరంగా ప్రతిభ చూపించుకునే ఛాన్స్ దొరకలేదు. ప్రధాన ప్రతినాయకుడిగా జిషు సేన్ గుప్తా అలవాటైన విలనిజంతో ఆకట్టుకున్నాడు. సునీల్‌ను ఒకటి రెండు సీన్స్ మినహా ఆద్యంతం కామెడీ విలన్‌గానే చూపించారు. ఈ కథకు కీలకమైన దర్శన పాత్రను పోషించిన చిన్నారి చక్కటి నటనతో ఆకట్టుకుంది. నరేశ్, ప్రగతి, వెన్నెల కిషోర్, పృథ్వీ, వీటీవీ గణెళిశ్, అజయ్ ఘోష్.. ఇలా బోలెడంత మంది కమెడియన్లు కనిపించారు. వీరిలో ప్రతి ఒక్కరూ వాళ్ల పాత్ర పరిధి మేరకు నవ్వించే ప్రయత్నమే చేశారు. కమర్షియల్ డైరెక్టర్‌గా శ్రీను వైట్ల ప్రతిభకు వంక పెట్టాల్సిన పనిలేదు. కాకపోతే తన రొటీన్ కమర్షియల్ ఫార్మాట్ నుంచి బయట పడటం లేదు. రచయిత గోపీమోహన్ కూడా ఒకే థీమ్‌ను పట్టుకుని బండి నడిపిస్తున్నట్లు అనిపిస్తోంది. కథ.. కథనాల్లో కొత్తదనం చూపించలేకపోతున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం పర్వాలేదనిపిస్తుంది. భీమ్స్ చేసిన 'గుంగురూ గుంగురూ' పాట మాస్ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. ఇలాంటి రొటీన్ కథను నమ్మి భారీగా ఖర్చు పెట్టిన నిర్మాతల సాహసాన్ని మెచ్చుకోవాలి.

# దేవర-2 మరికొందరు బాలీవుడ్ స్టార్స్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీని సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందన్నారు. ఇది జరుగుతుందో, లేదో నాకు తెలియదు కానీ.. 'దేవర2'లో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్ ఉంటే బాగుంటుంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ఇది జరుగుతుందో, లేదో తెలియకుండా నేను ఎక్కువ వివరాలు పంచుకోకూడదు. తెలుగు, తమిళ ఇండస్ట్రీలకు చెందిన నటీనటుల పేర్లు చెబితే ఇప్పటినుంచే ఊహాగానాలు మొదలవుతాయి. 'దేవర2'లో అతిథి పాత్రలు కూడా ఉంటాయి. అవి సినిమాలో చాలా కీలకమైనవి. అతి త్వరలోనే వాటి వివరాలు ప్రకటిస్తాను అని కొరటాల శివ అన్నారు.'దేవర 2'పై కొరటాల ఎప్పటికప్పుడు అంచనాలు పెంచేస్తున్నారు.

మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఇటీవల వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు .ఎన్టీఆర్ కూడా ఈ సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత

# పట్టాలకు ఎక్కని వేణు మూవీ

### - దిల్‌రాజ్ దయతలిస్తేనే ముందుకు





నటుడిగా, కామెడీయన్‌గా మంచి గుర్తింపు పొందిన ఆర్టిస్ట్ వేణు యేల్దండి. జబర్దస్త్ షోతో స్టార్ కామెడీయన్‌గా ఎదిగిన వేణు.. 'బలగం' సినిమా తీసి అందరిని ఆశ్చర్యపరిచాడు. తెలంగాణ మాండలికం, ఎమోషనల్ స్టోరీ నేరేటివ్‌తో తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలని కట్టిపడేసాడు. దీంతో ఆయన నెక్ట్స్ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సినిమా రిలీజై రెండేళ్లవుతున్నా.. ఇంకో ప్రాజెక్ట్ షూట్ ప్రారంభించకపోవడంతో అసలేమైందని చర్చ జరుగుతోంది. కథను ఇప్పటికే ఇద్దరు స్టార్ హీరోలకు నేరేట్ చేసిన వాళ్ళమేన్నారు.. ప్రొడ్యూసర్ దిల్ రాజు ఏమన్నాడంటే.. వేణు యేల్దండి.. తన బలగం సినిమాతో తెలుగు సినీ ఇండస్ట్రీలో సంచలనమే సృష్టించాడు. ఈ సినిమాకి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన దిల్ రాజే నెక్ట్స్ సినిమాకి కూడా కమిట్మెంట్ ఇచ్చాడు. దీంతో 'ఎల్లమ్మ' కథ ఆధారంగా వేణు ఒక స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకున్నాడు. మొదట ఈ స్టోరిని నేచురల్ స్టార్ నాని కి నేరేట్ చేసినట్లు వార్తలొచ్చాయి. అయితే కథ నచ్చకో, డేట్స్ కాళీలేకో నాని ఈ సినిమాని యాక్సెప్ట్ చేయలేదని టాక్ వినపడింది. బేసిక్‌గా ప్రయోగాత్మక, ఉత్తమ కథాదీరిత సినిమాలు చేసే నాని ఇలా చేశాడేంటని అంతా అనుకున్నారు. దీంతో వేణు ఈ కథను హీరో నితిన్‌కి వినిపించారట. స్టోరీ నచ్చిన నితిన్ ఈ ప్రాజెక్ట్ ఓకే చేశాడని కూడా సినీ వర్గాల్లో టాక్. బేసిక్‌గా దిల్ రాజు ప్రొడక్షన్ అంటే నితిన్ నో చెప్పే ఛాన్సే లేదంటున్నారు. ఇదిలా ఉండగా గురువారం జరిగిన ఓ సినిమా మీటింగ్‌కి డైరెక్టర్ వేణుతో పాటు నిర్మాత దిల్ రాజు కూడా అటెండ్ అయ్యాడు. ఈ నేపథ్యంలో దిల్ రాజు మాట్లాడుతూ.. ' ఏం వేణు ఎల్లమ్మ కథ ఎప్పుడు మొదలు పెడుతున్నావు' అని ప్రశ్నించాడు. దీనికి వేణు స్పందిస్తూ.. మీరెప్పుడంటే అప్పుడే సార్ అన్నారు. ఈ నవంబర్‌లో షూట్ స్టార్ట్ చేద్దామా అన్నారు. దీనికి దిల్ రాజు నవ్వుతూ.. వద్దు ఫిబ్రవరిలో స్టార్ట్ చేద్దాము అంటూ సమాధానమిచ్చారు. దీంతో అనఫీషియల్‌గా ఈ ప్రాజెక్ట్‌కి హీరో సెలెక్ట్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాబిన్‌హుడ్, తమ్ముడు సినిమాలతో బిజీగా ఉన్న నితిన్ ఈ ప్రాజెక్ట్ చేయనున్నట్లు టాక్.

# హీరోయిన్‌తో ప్రేమలో పడ్డ నారా రోహిత్

తొలి సినిమా 'బాణం'తోనే ప్రేక్షకులని ఆకట్టుకున్న హీరో నారా రోహిత్. ప్రతినిధి సినిమాతో ఆడియెన్స్‌కి మంచి కిక్కిచ్చిన రోహిత్.. ఆ మూవీ సీక్వెల్ ప్రతినిధి 2తో మాత్రం నిరాశపరిచాడు. ఇదంతా పక్కన పెడితే ఇండస్ట్రీలోని మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో రోహిత్ ఒకరు. తాజాగా ఆయన పెళ్ళికి సంబంధించిన అప్డేట్ ఒకటి సందడి చేస్తుంది. అది కూడా ఒక హీరోయిన్‌ని ప్రేమించి పెళ్లిచేసుకోనున్నట్లు సమాచారం. సాక్షాత్ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తమ్ముడి కుమారుడైన రోహిత్ ఇండస్ట్రీలో మంచి సినిమాలతో ఫర్వాలేదనిపిస్తునాడు. భారీ హిట్లు లేకపోయినా డిజాస్టర్ కథలు కూడా తీయకపోవడంతో కెరీర్ సాఫీగానే సాగుతోంది. అయితే వయసు మాత్రం నాలుగు పదులు దాటడంతో పెళ్లి చేసేయాలని నారా ఫ్యామిలీ ఫిక్స్ అయిపోయిందంట. అంతే కాదు త్వరలోనే పెళ్ళికి ముహర్తం కూడా ఫిక్స్ చేశారు. ఈ నెల 13నే ఎంగేజ్మెంట్. ప్రతినిధి 2 సినిమాలో హీరోయిన్‌గా చేసిన 'సిరి' ని రోహిత్ ప్రేమించాడట. ఈ జంట పెళ్లి చేసుకోవడానికి కూడా సిద్ధపడటంతో వధువుని ప్రత్యేకంగా వెతికే పని లేకుండా చేశావు అంటూ నారా ఫ్యామిలీ ఖుషి అవుతోంది.

ప్రస్తుతం ఈయన ప్రతినిధి 2 సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. టీజర్, ట్రైలర్‌లతోనే మంచి హైప్ తెచ్చుకున్న ఈ మూవీ కొన్నాళ్లు చర్చల్లో బాగా నిలిచింది. అయితే సీఎం మరణం.. అతని కొడుకుని సీఎం చేయాలని పట్టుబట్టడం.. సంక్షేమ పథకాలపై సెటర్లు.. అభివృద్ధి జరగలేదనే విమర్శలు.. ఇవన్నీ అధికార వైసీపీ పార్టీకి కనెక్ట్ అయ్యే అంశాలుగా ఉన్నా.. కథ పరంగా ఆ పార్టీని కెలికే ప్రయత్నం అయితే చేయలేదు. కేవలం సీఎం మర్డర్ మిస్టరీ చుట్టూ పొలిటికల్ డ్రామా మాత్రమే చూపించారు.



# ఆమ్రపాలిని టార్గెట్ చేసింది ఎవరు.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి కేటాయించినా క్యాట్ ఆదేశాలతో తెలంగాణలోనే కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ లకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈనెల 16వ తేదీలోపు ఏపీకి కేటాయించినవారు ఏపీలో, తెలంగాణకు కేటాయించినవారు తెలంగాణలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్ లు, ముగ్గురు ఐపీఎస్ లు ఏపీకి, ఏపీ నుంచి ముగ్గురు ఐఏఎస్ లు తెలంగాణకు వెళ్లాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న ఆమ్రపాలి గురించే చర్చ ఎక్కువగా జరుగుతోంది.

### బీజేపీ పావులు కదిపింది

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారం చేపట్టాలనే వ్యూహాన్ని రచించుకుంటోంది బీజేపీ. తాజాగా ఇచ్చిన ఆదేశాలతో రేవంత్ రెడ్డి సర్కారును ఇబ్బందుల్లోకి నెట్టేందుకు కేంద్రం పావులు కదిపిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరిపాలన కుంటుపడితే సహజంగానే ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. అది తమ పార్టీకి కలిసివస్తుందని బీజేపీ భావనగా ఉంది. పరిపాలన కుంటుపడాలంటే డైనమిక్ గా, నిజాయితీగా, నిక్కచ్చిగా పరిపాలన చేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెస్తున్న అధికారులను నియంత్రిస్తే సరిపోతుందని ఆ పార్టీ నేతలు యోచించారు. అందుకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉపయోగించుకొని బదిలీలు చేశారనే విశ్లేషణలు మీడియాలో వెలువడుతున్నాయి.

### మార్పులకు శ్రీకారం చుట్టారు

గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ గా ఆమ్రపాలి బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక మార్పులు తీసుకువచ్చారు. ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటున్నారు. ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరిస్తున్నారు. వరదల వచ్చిన సమయంలో స్వయంగా వెళ్లి అక్కడి పరిస్థితులను ఆమ్రపాలి తెలుసుకొని, ఇబ్బందులు రాకుండా చూశారు. పాలనలో వేగాన్నిన చూపిస్తున్న అధికారులను తప్పించి కొత్తవారిని నియమిస్తే అంతగా ఇమడలేరని, అంతకుముందు పనిచేసిన అధికారులంత స్థాయి లో పనిచేయలేరని, పాలన కుంటుపడుతుందని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. హైదరాబాద్ నగరం తెలంగాణకు గుండె లాంటిది కాబట్టి, తన యూపీఎస్సీ దరఖాస్తులో విశాఖపట్నంను తన పర్మినెంట్ చిరునామాగా ఆమ్రపాలి చూపించడంతో పని సులువైంది. వికారాబాద్ కు సబ్ కలెక్టర్ గా అడుగుపెట్టిన ఆమ్రపాలి వివిధ శాఖల్లో, వివిధ హోదాల్లో సేవలందించి తనదైన ముద్ర వేశారు.

# కులమతాలకు అతీతంగా అందరికీ విద్య

- విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు
- ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దే లక్ష్యం
- లక్ష్మీపురంలో గురుకులానికి శంకుస్థాపనలో భట్టి



**ఖమ్మం (ప్రశ్న న్యూస్) :** కుల, మతాలకు అతీతంగా అందరినీ సమన్వయపరుచుకుంటూ ముందుకెళ్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అన్ని వర్గాల వారి కోసం విద్యా బుద్ధులు నేర్పేందుకు నాంది పలికామన్నారు. చదువు, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని లక్ష్మీపురంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ ఏడాది సమీకృత గురుకులాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే సాధ్యం కానిదేది లేదు. వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల భవనాలు పూర్తి కావాలి. వీటిలో సకల సౌకర్యాలు పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ విద్యావిధానం నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాసంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రజల్లో మత సామరస్యం పెరుగుతుందని అన్నారు. కొందరు ప్రభుత్వాన్ని అవమానించటమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు భోదన అందిస్తామని.. సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం కోసం ఈ ఏడాదికి రూ.5వేల కోట్లు కేటాయించామని అన్నారు భట్టి విక్రమార్క. మొదటి దశలో 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకి శంఖుస్థాపన చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం కులం ,మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేశారని.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా అందరూ కలిసి ఒక్క దగ్గర చదువుకుంటారని అన్నారు. రాష్ట్ర ,దేశ నిర్మాణానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 25 వేల పాఠశాలలో రూ. 1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని అన్నారు.

# ఏపీలో లిక్కర్ షాపు దరఖాస్తులకు ముగిసిన గడువు

- 90 వేల వరకూ దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం
- రాష్ట్ర ఖజానాకు రూ.1800 కోట్లు ఆదాయం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** లిక్కర్ షాపుల లైసెన్సుల ద్వారా ఏపీ ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఇవాళ్టితో ముగిసింది. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు ఈ గడువు ముగియగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. లిక్కర్ షాపుల కోసం సుమారుగా 90 వేల వరకూ దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. దరఖాస్తుదారుల నుంచి ఫీజుగా రూ.2 లక్షలు చొప్పున వసూలు చేశారు. దీంతో దరఖాస్తు రుసుము రూపంలో ఏపీ ప్రభుత్వ ఖజానాకు రూ.1800 కోట్లు వచ్చినట్లు సమాచారం. అయితే దరఖాస్తు చేసుకునే గడువు ముగిసినప్పటికీ రాత్రి వరకూ డీడీ సొమ్ము చెల్లించేందుకు అవకాశం ఉంది. డీడీలతో ఎక్సైజ్ శాఖ కార్యాలయాల వద్దకు ఏడు గంటలలోపు చేరుకున్నవారికి రాత్రి 12 గంటల వరకూ అవకాశం ఇచ్చారు. ఇక లిక్కర్ షాపు లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు రాత్రి 12 గంటల వరకూ దరఖాస్తు రుసుము చెల్లించే అవకాశాన్ని ఏపీ అబ్కారీశాఖ కల్పించింది. ఇక అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలోని 113 లిక్కర్ షాపులకు 5700 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్రంలోని 3,396 మద్యం దుకాణాలను ఏపీ అబ్కారీశాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగియగా నేడు, రేపు అంటే అక్టోబర్ 12, 13వ తేదీల్లో దరఖాస్తులను పరిశీలిస్తారు. ఇక అక్టోబర్ 14న జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీస్తారు. అనంతరం లాటరీలో మద్యం దుకాణాల లైసెన్సులు గెలుపొందినవారికి అక్టోబరు 15వ తేదీ నాటికి లిక్కర్ షాపులను అప్పగిస్తారు. ఇక అక్టోబర్ 16వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుంది. మరోవైపు లిక్కర్ షాపుల కోసం కొన్ని ప్రాంతాల్లో అనూహ్య స్పందన రాగా మరికొన్నిచోట్ల ఎక్కువగా దరఖాస్తులు రాలేదు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో రెండు చోట్ల ఒక్కో మద్యం షాపు కోసం 110 వరకూ దరఖాస్తులు వచ్చాయంటేనే పోటీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే మరికొన్ని జిల్లాలలో మాత్రం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడటంతో దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాలేదు. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలు సైతం వీటిలో జోక్యం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై సీఎం చంద్రబాబు సైతం సీరియస్ అయ్యినట్లు సమాచారం. ఈ క్రమంలోనే దరఖాస్తు గడువును రెండురోజుల పాటు పొడిగించినట్లు తెలిసింది. ఇక ఇప్పుడు గడువు పూర్తికాగా రూ.1800 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. ఇక అమెరికా, యూరోప్ దేశాల నుంచి కూడా మద్యం షాపుల కోసం దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఒక్క అమెరికా నుంచే 20కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది.

# మూసీ మురికిని ఏం చేస్తారు

- మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లు కూల్చడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఖండించారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎంతో కష్టపడి చిన్నచిన్న స్థలాలు కొనుక్కున్నారని, వారికి ప్రభుత్వమే అన్నీ అనుమతులు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ చేశారు. మూసీ రిటర్నింగ్ వాల్ నిర్మించి కూడా సుందరీకరణ చేయెచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్నీ డ్రైనేజీలు మూసీలోనే కలుస్తున్నాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందని ఆయన చెప్పారు. గంగా నదిపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శుద్ధి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. రేస్ కోర్స్ స్థలం అమ్మేసి మరీ సుందరీకరణ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఎ÷-లాన్ లేకుండా ఇళ్లు కూల్చివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం దుందుడుకుగా వ్యవహరిస్తానంటే కుదరదని కేంద మంత్రి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ పక్రియ అని, బాధితులు ఎవరూ భయపడొద్దని చెప్పారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని ఆయన మరోసారి చెప్పుకొచ్చారు. ప్రజలు బలహీనులు కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా అంటే భూతం కాదని, గతంలోనూ అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేదని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం దాని పేరును మార్చారని, అదే హైడ్రా అని చెప్పారు. హైడ్రా ముందుగా మూసీ నదిలో ఉన్న బస్ డిపో, మెట్రో పిల్లర్స్‌ను కూల్చాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా ముందుగా పేదవారి ఇళ్లు ఎలా పడకొడతారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రావాలని డిమాండ్ చేశారు. మూసీలో కలిసే మురుగునీరు ఏం చేస్తారో ముందు సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల మురుగు నీరు వచ్చి మూసీలోనే కలుస్తోందని తెలిపారు.

# తెలంగాణలో సమగ్ర కులగణనపై ఉత్తర్వులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సమగ్ర కులగణనపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్లు సర్కారు జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. ఈ సర్వే బాధ్యతను ప్రణాళిక శాఖకు అప్పగించారు. 60 ఏరోజుల్లో సర్వే పూర్తి చేయాలని జీవోలో పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపైనా ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను శుక్రవారం నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చీఫ్‌గా నియమితులయ్యారు. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. ఉపకులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది. కాగా, సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన కమిషన్ నివేదిక తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని.. ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని సీఎం గడువు నిర్దేశించారు.

కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడం సహా, వాటన్నింటినీ ఏక సభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. ఉమ్మడి పది జిల్లాల్లోనూ క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదులు స్వీకరించేలా పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు.

# పేకాట ఆడుతూ పట్టుబడ్డ నాగారం మున్సిపాలిటీ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తనయుడు కౌకుట్ల రాహుల్ రెడ్డి

- పట్టుబడిన వారిలో మరికొందరు స్థానిక రాజకీయ నాయకుల కుమారులు



నాగారం (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారంలో పేకాట స్థావరంపై కీసర పోలీసుల దాడులు చేసారు. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారంలో పేకాట స్థావరంపై కీసర పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. పేకాట స్థావరంలో నగరం మున్సిపాలిటీ చైర్మన్ తనయుడు కౌకుట్ల రాహుల్ రెడ్డి కలిపి మరో ఎనిమిది మంది పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. పేకాట రాయుళ్ళ నుండి 3 లక్షల 41 వేల నగదు, 8 మొబైల్ ఫోన్లు, 3 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న కీసర పోలీసులు.






Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588